ఆంధ్రమహిళ



Andhra Mahila October 1963-50 nP

ఆంధ్ర మహిళ

మహిళాభ్యుదయ

మాస పత్రిక

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్
వ్యవస్థాపకురాలు

ప్రకటనరేట్లు

(ఒకేరంగులో)

నాలుగవ రేపరు పుట	...	రు.	100/-
లోపలి రేపరు పుట (2, 3)	...	,,	80/-
లోపలి సాదా పుట	...	,,	60/-
లోపలి అర్ధ పుట	...	,,	30/-
పావు పుట	...	,,	15/-

'ఆంధ్ర మహిళ'

(మహిళాభ్యుదయ మాసపత్రిక)

వ్యవస్థాపకురాలు:
శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

విడి పత్రిక-50 నయాపైసాలు   సం॥ చందా - రూ 6-00

సేవాసంస్థలకీ, స్త్రీల క్లబ్‌లకీ, గ్రంధాలయాలకీ, విద్యాలయాలకీ, జీవిత సభ్యులకీ సంవత్సర చందా- 3-రు.   వ్యక్తులకి- 6-రు.

చందా పైకము ఈ దిగువ అడ్రసుకు పంప ప్రార్ధన.

మేనేజరు
ఆంధ్ర మహిళ
7. ఎ. రోజరీ చర్చిరోడ్డు.   శాంథోమ్,   మద్రాసు-4



ఆంధ్ర మహిళ

సంపుటి 19 అక్టోబరు 63 సంచిక 10

విషయసూచిక

ముఖచిత్రం.

కీ. శే. పొణకా కనకమ్మగారు

దివ్యస్మృతి — "నళిని"	...	2
సంపాదకీయం	....	3
బాపూజీ అమరవాక్కులు	...	5
కీ. శే. పొణకా కనకమ్మగారు	....	6
గర్భిణీస్త్రీల ఆహారం	....	8
పర్యటన విశేషములు		
డాక్టర్ ద్వారకాబాయ్	...	9
తుడికోర్కె —		
శ్రీ యన్. రామారావు	....	13
కృష్ణవేణి (పుణ్యనదులు)		
శ్రీమతి వారణాసి యశోదాదేవి	....	17
అంతిమవిజయం — శ్రీ సత్యం	....	23
శారదలేఖలు	....	25
శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ		
స్త్రీల వృత్తినైపుణ్యం	....	28
భగ్నజీవి		
శ్రీమతి జె. నాగరాణి	....	29

ఆంధ్ర మహిళ

7 ఎ, రోజరీ చర్చిరోడ్, శాంథోమ్ మద్రాసు-4

దివ్యస్మృతి

[ఆదినుండి అధ్యక్షపదవి నలంకరించిన స్వర్గీయ మీర్జాపురం రాణీవారికి
ఆంధ్రమహిళాసభ తరఫున జోహారు]

పరమపదించెనా
పావని మనరాణి,
పాలింపకుండునా
ఆమె జీవనసరణి-

ఠీవికి, యీవికి
దీటైన రాణి-
కూర్మికి, పేర్మికి
కుదురైన రాణి-
నిష్ఠకు, నియతికి
నెలవైన రాణి-

పరమపదించెనా
పావని మనరాణి,
పాలింపకుండునా
ఆమె జీవనసరణి-

ఆమెతోడి
సమావేశము
మనకిచ్చెను
మహదావేశము,
ఆమె దయచేసిన
సన్నివేశము
మనకు కూర్చెను
మహాభినివేశము

ఆమె సన్నిధానము
మన కయ్యెను
పెన్నిధానము,
ఆమె సందర్శనము
మన కయ్యెను
ఆత్మశోధనము-

పరమపదించెనా
మన పట్టపురాణి,
పాలింపకుండునా
ఆమె అమృతవాణి-

స్త్రీజనశ్రేయము
ఆమె కైనది ధ్యేయము,
ధర్మానుసంధానము
ఆమె కైనది ధ్యానము-
అతి సిదానము
ఆమె విధానము-
ఆమె పాలనము
మనకు
స్వపరిపాలనము,
ఆమె లాలనము
మనకు
ఆత్మోన్మీలనము-

పరమపదించెనా
మన పట్టపురాణి,
పాలింపకుండునా
ఆమె అమృతవాణి-

అనుగ్రహము
    వీక్షణముల,
అనుమోదము
    భాషణముల--
ఉత్సాహము
    యెడద యెడద,
ఉద్యమమ్ము
    విడిది విడిది-

తిరుచూర్ణపు
    తిలకముతో,
తిరుమణి
    అర్ధేందువుతో-
విమలభక్తి
    భావముతో,
అమలధర్మ
    తేజముతో
వెలుగొందెడి
    శుభవదనము,
వెలిగించెడి
    స్మృతిపథమ్ము-
మటుమాయమయ్యెనా
    ఆమె తేజస్స్ఫురణ
మనల కాయకుండునా
    ఆమె దివ్యస్మరణ-

ఆమె కలిగించినది
అధ్యక్షపదవికి
అమితగౌరవము,
ఆమె కొనితెచ్చినది
ఆంధ్రమహిళాసభకు
అతిశయనామము-

సన్నుతులివె, మన
పట్టపురాణికి-
సన్నుతులివె
పరమకళ్యాణికి-

—"నళినీ"

ఆంధ్రమహిళ

వ్యవస్థాపకురాలు : దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపుటి 19 :: అక్టోబరు 1963 సంచిక 10

శ్రీమతి సుచేతా కృపలానీ

శ్రీమతి సుచేతాకృపలానీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిత్వపదవిని అలంకరించి, భారతచరిత్రలో నూతనాధ్యాయనికి నాందీవాక్యం పలికారు. ఈమె ముఖ్యమంత్రిఅయి, భారత స్త్రీజాతికి నూతన గౌరవావకాశాలూ రెండూ కల్పించారు. ఇంతవరకూ భారతస్త్రీలు, గవర్నరులుగానూ, కేంద్ర రాష్ట్ర మంత్రులుగానూ, వివిధ దేశాలరాయబారులుగానూ, యునైటెడ్ నేషన్స్ ప్రెసిడెంటుగానూ, కాంగ్రెసు ప్రెసిడెంట్లుగానూ నియమింపబడినారు, ఎన్నికయినారు. ఒక స్త్రీ రాష్ట్రముఖ్యమంత్రి అవడం మనజాతి చరిత్రలో యిది ప్రప్రథమం. ఈ ఎన్నిక భారత స్త్రీలందరికీ గర్వకారణమని వేరేచెప్పనక్కరలేదు.

శ్రీమతి సుచేతా కృపలానీ బాపూజీ ప్రియశిష్యురాండ్రలో ఒకరు. ఆచార్యకృపలానీకి ధర్మపత్ని. సంస్కారప్రియులూ, సుప్రసిద్ధవైద్యులూ అయిన కుటుంబంలో జన్మించారు. రాజకీయాల్లో, సాంఘిక కార్యకలాపాల్లో, విద్యారంగంలోమంచిదిట్ట. ఢిల్లీ, పంజాబ్ విశ్వవిద్యాలయాలనుంచి యమ్. ఎ. డిగ్రీని సువర్ణపతాకాలతో ప్రప్రథమురాలుగా స్వీకరించింది.

శ్రీమతి సుచేత రాజకీయాలకీ, సంఘసేవకి నూతనవ్యక్తిగాదు. 1934 లో బీహారుభూకంపం వచ్చినప్పుడు అచటి శరణార్థులకి, వసతి సౌకర్యాలకై, నెలల తరబడి పాటుబడింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో స్త్రీల విభాగం నెలకొల్పడానికి, ఆ తొలిరోజుల్లో, అత్యంత పరిశ్రమచేసిన వారిలో యీమె ముఖ్యురాలు. క్విట్ యిండియా వుద్యమంలో, స్వాతంత్ర్య సమరంలో అనేకసార్లు కారాగారవాసమనుభవించారు. కస్తూరిబానిధికి కార్యదర్శినిగా, గాంధీమెమోరియల్ ట్రస్ట్‌కి వుపాధ్యక్షురాలిగా నిధిసేకరణలో, ఆనిధిని ప్రజోపయోగకార్యాలకి వినియోగించడంలో అనన్యమైన ప్రతిభ చూపారు. దేశవిభజనానంతరం ఏర్పడిన మతకలహాలలో, సర్వ

స్వం కోల్పోయిన లక్షలాది శరణార్థులకి పునరావాస సౌకర్యాలు కల్పించడానికి అనన్యమైన ప్రయత్నాలు చేశారు.

ఢిల్లీలోని నవహిందూ విద్యాసంస్థకి, లోకకళ్యాణ సమితికీ యీమె చైర్మన్. ఈ నవహిందూ విద్యాసంస్థ స్త్రీ వయోజనులకి విద్యగరపడం కొరకు ప్రత్యేకంగా ఏర్పడినది. లోక కల్యాణసమితి, ఢిల్లీనగర చుట్టుపట్లనున్న మురికివాడల వారికి, పుచిత వైద్యశాలలు, పాఠశాలలూ, స్త్రీల వయోజన విద్యాకేంద్రాలూ, సహకారబుణ గృహనిర్మాణ పథకాలు, వుచిత పాలపంపక కేంద్రాలూ మున్నగునవి నిర్వహిస్తూంది. ఇటువంటి పేదజనోపకరమైన సంస్థలు శ్రీమతి సుచేతా కృపలానీ సేవానిరతిని చెప్పకనే చెప్తున్నాయి.

రాజకీయంగా కృపలానీ దంపతుల స్థానం ప్రత్యేకమైనది, విచిత్రమైనది. శ్రీ కృపలానీ యిండియన్ నేషనల్ కాంగ్రెస్‌కీ కార్యదర్శిగా వున్న సమయంలో— సుచేతను వివాహ మాడారు. అటుపైన శ్రీ కృపలానీ కాంగ్రెస్ ప్రెసిడెంటుగా ఎన్నికయి, తదుపరి కాంగ్రెస్ పార్టీనుండి విరమించుకొన్నారు. శ్రీమతి సుచేత కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యురాలుగా పార్లమెంటు సభ్యురాలుగా భారత రాజ్యాంగ కార్యకర్తలలో ఒకరిగా, ఐక్యరాజ్య సమితికి భారతదేశ సభ్యురాలుగా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర మంత్రిణిగా, రాజకీయ వాతావరణానికి చిరపరిచితురాలు. ఈనాడు ఈమె ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అయింది అంటే, అదేదో అకస్మాత్తుగా, ఆకాశంనుంచి వూడిపడిన పదవీగాదు, ఘనతా కాదు. ఇది సహజంగా రావలసి వున్నదే.

బాపూజీ ఆశీర్వాద బలంతో రాజకీయరంగంలోకి, సాంఘిక కార్యకలాపాలలోకి దూకిన బహు కొద్దిమంది స్త్రీలలో శ్రీమతి సుచేత ఒకరు. గాంధీజీ రాజకీయ స్వాతంత్ర్యంతోపాటు, రాజకీయంగా, సాంఘికంగా స్త్రీలకి సమాన హక్కులు వోటుహక్కులు కలుగజేశారు. వారు కలిగించిన ఈ అమూల్యావకాశానికి భారత స్త్రీలు వున్నతిని ప్రతిష్ఠత్తిని చేకూరుస్తున్నారన్నది నిర్వివాదాంశం. ఒక్కొక్క పంథాలో ఒక్కొక్క వనిత నూతనావకాశం కల్గించినట్లే శ్రీమతి సుచేతా కృపలానీ ముఖ్యమంత్రిత్వ పదవికి నాందీవాక్యం పలికారు. ఈ అమూల్యావకాశం, ఈ నూతన పంథా యిక్కడితో ఆగిపోదని మా నమ్మిక. భారత స్త్రీలు అఖండ భారతావనిలో అత్యంతగౌరవ ప్రదమైన స్థానాలని పొందుతారని చరిత్రలో ఆశిస్తున్నాము. ఈ శుభసమయంలో శ్రీమతి సుచేతాకృపలానీకి ఆంధ్రమహిళ హృదయపూర్వక అభివందనములు తెలుపుతున్నది.

— మాలతీ చందూర్
గౌరవ సంపాదకులు

బాపూజీ అమరవాక్యాలు

అంతరాత్మ ప్రబోధం అధిక సంఖ్యాకుల అభిప్రాయంతో ఏకీభవించ నక్కరలేదు.

★ ★ ★

మానవ ప్రబోధం ఒకటి, అంతరాత్మిక ప్రబోధం మరొకటి, అంతరాత్మిక ప్రబోధం దశదిశలకూవ్యాపించి నిలబడి, ధ్వనిస్తూనే వుంటుంది.

★ ★ ★

ప్రజల మెప్పుదలకు ప్రాకులాడే ప్రజాసేవకుడు చుక్కానిలేని పడవ వంటివాడు.

★ ★ ★

భయంవలన వచ్చే అధికారం కంటే ప్రేమజనితాధికారం వేయిరెట్లు సార్ధక మవుతుంది, శాశ్వతంగా వుంటుంది.

★ ★ ★

హృదయ పవిత్రతలేని అన్యమత స్వీకారంలో భగవంతుడూలేడు, మతమూలేదు.

★ ★ ★

నిజమైన అసంతృప్తి అభివృద్ధికి నాంది వంటిది.

★ ★ ★

అధిక సంఖ్యాబలంతో ఏర్పడే ప్రభుత్వాలు అవినీతికి పాల్పడే అవకాశం వుంది.

★ ★ ★

అభివృద్ధికి మార్పు అవసరం. అందుచేత నిజాయితీపరుడు తాను పట్టిన కుందేలుకు మూడేకాళ్ళు అనడు తప్పుగోచరిస్తే తిరగపడటానికి వెరువడు.

★ ★ ★

పాషాణం పాలను పాడుచేయునట్లు అస్పృశ్యత హిందూమతాన్ని పాడు చేస్తోంది.

★ ★ ★

జన్మకు, వృత్తికి అస్పృశ్యతనుఅంటకట్టే సిద్ధాంతం ఈ పాపిష్టి సిద్ధాంతం మతప్రభావాన్ని అరికట్టుతుంది.

సత్యాహింసలు రెండూ నా వూపిరితిత్తులు. ఇవిలేనిచో నేను గడియసేపు కూడా జీవించలేను

★ ★ ★

అతి పవిత్రమైన త్యాగాన్ని భగవంతు అపేక్షిస్తాడు.

★ ★ ★

మానవావేశాలు వాయువేగాన్ని మించి పరుగెత్తుతాయి, వీటిని సంపూర్ణంగా స్వాధీన పరచుకునేందుకు అంతులేని సహనశక్తి అవసరం.

★ ★ ★

ఒక ధర్మం అందరూ ఆచరించడానికి వీలుగా వుంటుంది. గుత్తవ్యాపారంవలె కొద్దిమంది చేతుల్లోవుండదు.

★ ★ ★

మహాకార్య సాధనలో నిమగ్నులైన మేధావులు కూడా తాత్కాలికపు కోపంవల్ల ఆ మహాకార్యాలను భగ్నం చేస్తారు.

★ ★ ★

పాపాలన్నీ రహస్యంగా జరుగుతాయి.

★ ★ ★

గౌరవానికి భంగం కలిగే సందర్భంలో మిత్రుని, శత్రువుని ఎవరినీ లెక్కచేసేదిలేదు.

★ ★ ★

చెడుచేసేవాడు ఎంత దుర్మార్గుడో, చెడునుగూర్చి ఆలోచించేవాడూ అంత దుర్మార్గుడే.

★ ★ ★

జీవిత వ్యామోహంలో పడనివాడు జీవితాన్ని ఆనందించ గలడు.

★ ★ ★

దుర్బలులు ఎప్పుడూ క్షమించలేరు, క్షమించటం సబలుల లక్షణం.

★ ★ ★

ఎంతగట్టి లోహమైనా వేడికి కరుగుతుంది. అట్లే అహింసయొక్క వేడికి ఎంత కఠిన హృదయుడైనా కరిగి పోతాడు.

అమరజీవి కనకమ్మగారు

ఉత్తమ దేశభక్తురాలు, సంఘసేవాధురీణ, కవయిత్రి అయిన శ్రీమతి పొణకా కనకమ్మగారు సెప్టెంబరు 15వ. తేదీ సాయంకాలం 3.50 నెల్లూరులో ప్రశాంతంగా కన్నుమూశారు. ఈమె మరణంతో ఆంధ్రమహిళాలోకం ముఖ్యంగా నెల్లూరు జిల్లావాసులు ఒక అమృతహృదయినిని, ఒక మాతృమూర్తిని కోల్పోయారని చెప్పవచ్చు. శ్రీమతి కనకమ్మగారి జీవితచరిత్ర భారత జాతీయసమరచరిత్ర, భారతజాతి సాంఘిక చరిత్ర. కనకమ్మగారి వయస్సు 72 సంవత్సరాలు. ఏడు సంవత్సరాలుగా హృద్రోగంతో పక్కమీదవుండి ఆఖరిఘడియలో అతి ప్రశాంతంగా కన్నుమూసిన ధన్యజీవి యీమె.

ఈమె గడిచిన శతాబ్దపు ఆఖరి దశలో 1,892 వ సంవత్సరంలో జన్మించింది. సంపన్న రెడ్డికులస్థుల యింట జననమొంది, మేనమామ అయిన శ్రీ పొణకా సుబ్బరామరెడ్డిగారిని పరిణయమాడారు. సంపన్నులు. ధార్మికులు అయిన కుటుంబంలో జన్మించినదగుటవలన యీమె బాల్యంనుంచి అన్నార్తులని, అతిథి, అభాగ్యతులని కన్నతల్లిలా, సోదరిలా ఆదరించి గౌరవించేదట. రాజకీయరంగ ప్రవేశానికి ముందుగానే గ్రంథాలయోద్యమంలో పాల్గొని సుజనరంజనీ సమాజం స్థాపించి తమ చుట్టుపక్కల గ్రామాలలో అనేక గ్రంథాలయాలు నడపడానికి పరోక్షంగా చాలా కృషిచేశారు. దాదాపు అర్ధ శతాబ్దికి వెనుక మొలకెత్తిన ఈ వుద్యమాభిలాష యీమె దృష్టిని రాజకీయాలవైపు మళ్ళించింది.

సుజనరంజనీ సమాజం విద్యాసాంఘిక విషయాలలో మానవసేవలో, హరిజనసేవలో పూజ్య బాపూజీకంటే ఒక అడుగు ముందువేసినది. హరిజన వాడలో, కలరా యిన్‌ఫ్లూంజా మొదలగు అంటువ్యాధులు ప్రబలిన సంధర్భాల్లో యీమె యీమె భర్తగారు, కుటుంబంలో బంధుమిత్ర సేవకులు హరిజనులకు మందుమాకులూ, పత్యపానాదులూ సమకూర్చేవారట శ్రీమతి కనకమ్మగారిలో సేవానిరతి జన్మతహః వచ్చింది. ఇటువంటి సేవానిరతి కలిగినవ్యక్తి - బాపూజీవల్ల ఆకర్షింపబడటంలో ఆశ్చరం కాదు.

సహాయ నిరాకరణోద్యమంలో, నూలు వడకడంలో ఖద్దరువస్త్రధారణంలో, అహింసలో, శాఖాహార స్వీకరణలో బాపూజీ ప్రియ శిష్యురాలయినదీమె. ఈమె కుటుంబంలో స్వయంగా వడికి నూలుతీసి పంచలు నేయించి, బాపూజీకి భక్తిపూర్వకంగా సమర్పించినారట

1920 నుండి యీమెకు కాంగ్రెసు వుద్యమంతో ప్రత్యక్ష సంబంధ మున్నది. ఖద్దరు ప్రచారం, రాట్నాల ప్రచారం, వీదేశీవస్తు బహిష్కరణ, స్త్రీల కాంగ్రెసు స్థాపన వీటన్నిటిలో యీమె హస్తంవున్నది. కాకినాడ కాంగ్రెసులో స్త్రీల వాలంటీర్ దళానికి నాయకురాలుగాను, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు వుపాధ్యక్షురాలుగాను, ఆలిండియాకాంగ్రెస్ సభ్యురాలుగాను యీమెకి బహుముఖాలుగా కాంగ్రెస్ పార్టితో సంబంధమున్నది.

ఈమెకి స్త్రీ విద్యనుగూర్చి నిరంతర తాపత్రయముండేది. 1923 లో కస్తూరిదేవి విద్యాలయ స్థాపన జరిగింది. ఈ విద్యాలయానికి కీ. శే. టంగుటూరి ప్రకాశంపంతులుగారు ప్రారంభోత్సవం చేశారు. ఈ విద్యాలయంలో స్త్రీలకి జాతీయ విద్య, కుట్టు, నూలువడకడం పేముపని మొదలగునవి నేర్పేవారు. ఆదిలో ఆర్థికంగా బహుయిబ్బందులకులోనవవలసి వచ్చిందిట. ఇంటింటా ముంతలుపెట్టి ధాన్యంసేకరించి దీని నిర్వహణ జరుపుతూండేవారుట ఆ కాలంలో సేవానిరతికి, కార్యదీక్షకు యిటువంటి వుదాహరణలు గీటురాళ్ళవంటివి.

1929 లో శ్రీమతి కనకమ్మగారు నిరంతర కృషి వలన 12 వందల అంకణాల భూమిని సేకరించ గలిగి విద్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పుడు ఆంధ్రదేశ సంచారంలోవున్న పూజ్యబాపూజీ భవన శంఖుస్థాపన చేస్తూ యీ భవన నిర్మాణానికి నెల్లూరు వాసులు సహాయం చెయ్యాలనీ, నెల్లూరులో చూడదగిన దేమైనావుంటే యీ కస్తూరిదేవి విద్యాలయమేననీ, అన్నారుట. మహాత్మునినోటివెంట అన్పతం రాదు. వారి మాటలు నిత్యసత్యాలు. అనాటి కస్తూరిదేవి విద్యాలయం యీనాడు వందలాది విద్యార్థినులతో దిన దిన ప్రవర్ధమాన మవుతున్నది.

1930లో వుప్పు సత్యాగ్రహ సమరంలో కారాగారానికి వెళ్లారు. అటు తరువాత విదేశవస్త్ర బహిష్కరణోద్యమంలో, కల్లు దుకాణాలవద్ద పికెటింగులూ యీ సందర్భాలలో కారాగార ప్రాప్తి కలిగింది. ఈమె జైలులో వుండగా హిందీ నేర్చుకోడమే కాదు తెలుగు భాషనుండి హిందీకి తర్జుమాలుకూడ చేశారు. ఈ కాలంలోనే యీమెకి అనారోగ్యం కలగడం, ఏకైక సంతానం మరణించడంజరిగింది. పుత్రికావియోగం కారాగారవాసం యివి యీమెని ఆధ్యాత్మిక జీవనం వైపుతిప్పి వేశాయి. ఆకాలంలోనే యీమె భక్తిప్రధానమైన రచనలు చేశారు.

కొందరు జన్మతా నిరంతర పరిశ్రమలో, ప్రజోపయోగ కార్యాలలో తలమున్కలుగా నిమగ్నమై వుండాలి. వారిలోఏదో అశాంతి, ఆరాటం నిర్మాణాత్మక కృషివైపు పరుగులు పెడుతూవుంటుది. శ్రీమతి కనకమ్మగారు యీకోవకిచెందిన వ్యక్తి. స్త్రీలవృత్తి విద్యాస్కూలు నిర్మించాలన్న ఈమె చిరకాల వాంఛితానికి. పుత్రికావియోగం, అనారోగ్యం, వయస్సు యివేమీ అడ్డురాలేదు. 1940–50 మధ్య నెల్లూరులో కస్తూరిదేవి పారిశ్రామిక విద్యాలయం స్థాపించారు. దీనికి కేంద్రసాంఘిక సంక్షేమ సంస్థ ధనసహాయంచేసి ప్రోత్సాహించినది, ఈ విద్యాలయ ప్రారంభోత్సవానికి శ్రీ దేశముఖ్ దంపతులు విచ్చేసి, ఆశీర్వదించారు. ఈ విద్యాలయంలో, చేతిపనులూ అల్లికలు, అద్దకము, కుట్లు. నేతమున్నగునవి నేర్పుతున్నారు. ఇచటచేతిపనుల ట్రయినింగ్ కోర్సుకూడా వుంది. సుమారు ఎనభైమంది విద్యార్థినులతో యీస్కూలు నిర్వహింపబడుతున్నది.

ఈమె కీ. శే. కేసరిగారు ఏర్పాటు చేసిన గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీత, మా ఆంధ్ర మహిళాసభ రజతోత్సవ సందర్భంలో గౌరవింపబడిన ప్రముఖ స్త్రీలలో యీమె వొకరు. ఆంధ్ర మహిళాసభ రజతోత్సవాలలో, సాంఘిక, విద్యారంగాలలో ముఖ్యంగా స్త్రీజాతి ప్రగతికై పాటుపడిన ప్రముఖ విదుషిమణులను గౌరవించి, రజితఫలక, పట్టువస్త్రాదులు సమర్పించారు ఆ గౌరవింపబడిన వారిలో శ్రీ కనకమ్మగారొకరు. అనారోగ్య కారణంవల్ల తొలినాటి సభలకి రాలేకపోయినా, మూడవనాడు యీమె స్వయంగావచ్చి రజత ఫలకాన్ని స్వీకరించారు. ఈ ఆంధ్రుల ఆడబడుచు, సోదరి మహిళాసంస్థ జరుపుతున్న పుత్సవాలకి, గౌరవానికి స్వయంగావచ్చి ఆశీర్వదించడం ఆ సభలకు పరిపూర్ణతను కలిగించింది.

శ్రీమతి కనకమ్మగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. స్థిర సంకల్పురాలు, మనోవాక్కాయ కర్మలా దీనులపాలిట అన్నపూర్ణ. అందువల్లనే భోగభాగ్యాదులను, ఐశ్వర్య అధికారాలను తృణప్రాయంగా విసర్జించి మానవసేవను భగవత్సేవగా చూడగలిగింది.

శ్రీ వెన్నలకంటి రాఘవయ్యగారుఅన్నట్లు కనకమ్మగారి వంటి వనితలకు మరణములేదు. ఎక్కడయితే స్త్రీ విద్య వుద్ధరింపబడినదో, ఎక్కడయితే మహిళల ప్రాథమిక హక్కులు రక్షింపబడినవో, ఎక్కడయితే రైతు వుద్యమాలు పుష్పించి ఫలించినవో అక్కడఆమె పేరు చిరస్థాయిగా నిలబడిపోతుంది. ★

గర్భిణీ స్త్రీల ఆహారం

గర్భిణీ స్త్రీ తీసుకునే ఆహారం, గర్భంలోని పిండం అభివృద్ధిచెందడానికీ, చక్కని ఆరోగ్యవంతమైన శిశువు జన్మించడానికీ తోడ్పడాలి. మాతాశిశువులు అంటువ్యాధులకు గురికాకుండా తగు శక్తిని కూడా వారికివ్వాలి.

గర్భిణీ సమయంలో మొదటి సగంకాలము, తల్లి వయస్సు, బరువు, చేసేపని, వీటినిబట్టి తీసుకునే ఆహారం వుండాలి. బరువుఎక్కువగా వుంటే దాన్నింకా ఎక్కువచేసే ఆహారం మానివెయ్యాలి. కొన్ని సందర్భాలలో బరువుతగ్గే ఆహారం తీసుకోవలసి వుంటుంది.

కొవ్వుపదార్థం : ఆహారంతో కొవ్వుపదార్థం రోజుకి 100 గ్రాములుండాలి. అది 150 గ్రాములకు మించితే ఆకలి చచ్చిపోవడమేగాక, రక్తప్రసారానికి కూడా హానిచేయవచ్చు. వెన్న మీగడలేగాక, సోయాబీన్సు, నువ్వులనూనె, కొబ్బరినూనె వగైరానూనెల రూపంలో కూడా కొవ్వుపదార్థాన్ని తీసుకోడం చాలముఖ్యం. కోడిగుడ్లు, మెదడు, కార్జం వగైరాలు ఎక్కువగా వుండే ఆహారం తగ్గించి తినాలి.

పిండిపదార్థం : మామూలు బరువున్న గర్భిణీ స్త్రీ రోజుకు 500గ్రాములకుమించని పిండిపదార్థం తీసుకోవాలి. బరువుజాస్తిగా వున్నస్త్రీ దానిని 250—300 గ్రాములకు తగ్గించాలి. ఎందుకంటే, శరీరంలో కొవ్వు పెరగడానికి పిండిపదార్థాలే మూలం. విరేచన బద్ధకం లేకుండా వుండేటందుకు పండ్లు, కూరగాయలు కూడా ఆహారంలో చేర్చాలి.

ద్రవపదార్థం : గర్భిణీ స్త్రీ తీసుకోవలసిన ద్రవ పదార్థం కూడ ఆమె బరువును బట్టేవుండాలి. ఉదాహరణకి 50 కిలోగ్రాముల బరువువుంటే 1¾లిటర్ల ద్రవ పదార్థం కావాలి. అంటే ఒకకిలోగ్రాము బరువుకి 35 గ్రాముల ద్రవపదార్థం తీసుకోవాలి. మనం తినే ఆహార పదార్థాలలో ద్రవం వుంటుంది కనుక వేరుగా ద్రవ రూపంలో తీసుకోవలసినది అంత ఎక్కువ అవసరం లేదు.

ఖనిజ లవణాలు : గర్భిణీ స్త్రీకి ఖనిజ లవణాలు ఎక్కువగా కావాలి. కాల్షియం, భాస్వరం, మెగ్నీషియం, సోడియం, ఇనుము, రాగి, కోబాల్టు, వీటి లవణాలు అత్యంత ముఖ్యం. గర్భంలోని శిశువుకు ఎముకలు ఏర్పడే సమయంలో కాల్షియం ఎంతైనా అవసరం బైటనుండి దానిని సప్లయి చేయకపోతే, తల్లిశరీరంలో వుండే కాల్షియంను, శిశువు తీసివేసుకుంటుంది అప్పుడు తల్లి బలహీనపడిపోతుంది. అంటువ్యాధుల నుండి నిలవరించుకునే శక్తితగ్గిపోతుంది. గర్భిణీ మొదటి దశలో పాలు, గుడ్లు, ఓట్సు, క్యాబేజి, క్యారెట్ వగైరా ఆహారాల ద్వారా కాల్షియం ఇవ్వాలి. నెలలు నిండినకొలదీ రోజుకు 1గ్రాము చొ॥ మందు రూపంలో కూడా కాల్షియం ఇవ్వాలి. కాల్షియంతో పాటు శిశువు ఎముకలు, నరాలు బలంగా పెరగడానికి భాస్వర లవణాలు కూడా కావాలి. ఇవిరోజుకి 1.6గ్రా॥ వుండాలి. సోడియం క్లోరైడ్, అంటే మనంతినే మామూలు ఉప్పు రోజుకి 12—15గ్రాములు చాలు. నెలలు నిండిన కొలదీ ఆహారంలో ఉప్పు తగ్గించాలి. 5—8 గ్రాములుంటేచాలు.

గుండెకు సంబంధించిన కండరాలకు మెగ్నీషియం లవణం అవసరం, అదిరోజుకి ½ గ్రా॥చాలు. సముద్రపు చేపలో ఇది ఎక్కువగా వుంటుంది.

మంచి రక్తం పట్టడానికి ఇనుము, కోబాల్టులవణాలు అవసరం. ఇవిరోజుకి 15మిల్లీగ్రాములు తక్కువ కాకుండా తీసుకోవాలి. ఇవి గుడ్లు, కార్జం, చిక్కుడు, బటానీ, బియ్యం, యాపిల్సు, బీటుదుంపలలో లభిస్తాయి.

విటమినులు : గర్భిణీస్త్రీ ఆరోగ్యానికీ లోపలశిశువు బాగా పెరగడానికీ విటమిన్లు కావాలి, అవితక్కువైతే గర్భస్రావం, అకాల ప్రసవంలాంటివి సంభవించవచ్చు.

విటమిన్ ఏ॥ రోజుకి 15000 యూనిట్లు తక్కువగాకుండా తీసుకోవాలి చివరి రెండు నెలలలో దానిని 10 12వేల యూనిట్లకు పెంచాల విటమిన్ బి రోజుకి 3మిల్లీగ్రాములు బి 12 నుంచి 5మిల్లీగ్రాములు, "సి" 100—200 మిల్లీగ్రాములు "డి 600—800యూనిట్లు, "ఇ, 10మిల్లీగ్రాములు తీసుకోవాలి. గర్భస్రావం అయేలక్షణాలుంటే ఈ విటమిన్ "ఇ, రోజుకి 100—150 మిల్లీగ్రా వరకూ ఇవ్వాలి.

ఆహారనియమం : గర్భిణీ స్త్రీకి ఆహార నియమం చాలాముఖ్యం. నాలుగు గంటలకొకసారి చొ॥ రోజుకి 4సార్లు ఆహారంతీసుకోవాలి. ఉదయం తీసుకునే టిఫిన్ రోజుమొత్తం మీద తీసుకునే ఆహారంలో 1/5వంతు వుండాలి, మధ్యాహ్నభోజనం మస్తుగా వుండాలి. సాయంకాలం పెందలాడే భోంచెయ్యాలి. పడుకోడానికి ఒకగంట ముందుగ్లాసుడు పాలుతాగాలి. నెలలు నిండిన తరువాత, ముఖ్యంగా, 9వ నెలవచ్చిన తరువాత రోజుకి 5—6సార్లు ఆహారం తీసుకోవాలి. ★

పర్యటన విశేషములు

ఇప్పుడు మాకు రష్యా ఎట్టి అతిథి సత్కారములు జరిగినవో కొంచెము వివరించుతాను. 1963 జూన్ 21వ తేదీకి మేము మాస్కో నగరానికి అక్కడి కాలమానం 2-30 P.M. కు చేరినాము. అయితే సాయంత్రం 6 గంటలకే విమానాశ్రయంలోను ఇతర హోటళ్లలోనూ గూడా భోజనం ఇవ్వడం మూసివేశారు గనుక మేము కొంచెం పలహారముచేసి మా గౌరవార్థము ఏర్పాటు చేసిన ఒక వినోద ప్రదర్శనాన్ని చూడటానికి వెళ్లాము. ఆనాటి ప్రదర్శనములో ఒక రష్యను మహిళ భరత నాట్యము చేయడము ప్రధానాంశము. ఇవిగాక బొమ్మలాటలు గారడి కొంత సంగీతముతోటి ఆనాటి వినోద ప్రదర్శనము మాకు ఎంతో ఆశ్చర్యాన్ని ఆనందాన్ని కలుగజేసినది. వినోదప్రదర్శనం నుండి మేము బయటకు వచ్చినప్పుడు రాత్రి పదిగంటలకు గూడ బయట వెలుతురు వుండడం మాకు ఆశ్చర్యం కలిగించినది. రష్యాదేశములో ముఖ్యముగా మాస్కోలో ఈరోజులు వేసవికాలము గదా రాత్రి 10-30 నిముషముల నుండి 2-30 గంటల వరకు మాత్రమే చీకటిగా ఉంటుంది. 2-30 గంటలకే సూర్యోదయం ప్రారంభం అవుతుంది.

ఆ మరునాడు మాస్కోనగరాన్నంతా మా ప్రతినిధులము చుట్టివచ్చాము. మాస్కోనగరము దాదాపు 70 లక్షల జనసంఖ్య కలిగినప్పటికీ రద్దీలేకుండా ఎంతో ప్రశాంతంగావుంటుంది ఈ నగరం. రోడ్డుపైనున్న భవనాలుగూడా అద్దపుతలుపులని గలిగివుంటాయి గాని అక్కడ దొంగలభయం లేకపోవడంవల్ల మనకు ఇనుపతలుపులు ఎక్కడా కనుపించవు అక్కడక్కడ చిన్న చిన్న నేరాలు జరిగియున్నప్పటికి వానిని నివారింపడానికి ఎక్కువ జాగ్రత్తలు తీసుకోబడుతుంటాయిట. సాధారణంగా బస్సుటిక్కెట్టులను నాణెములను పడవేసి మిషనుల ద్వారానే పొందగల్గుతాము. ఈ బస్సుటిక్కెట్ల ధర ఎంతదూరమైనా ఒకే విధంగా వుంటుంది ఒకవేళ ఎవరైనా టిక్కట్లు లేకుండా ప్రయాణంచేస్తూ పట్టుపడ్డప్పుడు అతని ఫోటోను ఇతర వివరాలతో సహా పత్రికలలో ప్రచురించి ప్రజల సద్భావాన్ని పోగొట్టుకొనేటట్లు చేస్తున్నప్పుడు ఎవరికి అట్లా మోసగించడానికి ధైర్యం వుంటుంది? ఇట్లా ఈ నేరాలను దూరం చెయ్యడానికి నైతిక వత్తిడి అధికంచేయబడుతూ వున్నది

మధ్యాహ్న కాలమప్పుడు మేమంతా చరిత్ర ప్రశిద్ధమైన రెడ్‌స్క్వేర్‌కు పోయి ప్రథమ అంతరిక్ష సంచారిణి వాలెంటీనా టెరెష్కోవాకు అభినందనలు వెల్లడించాము. ఆసమూహంలో శ్రీనికిటాకృశ్చవూ ఇతర ముఖ్యులూ గూడా పాల్గొన్నారు. రెండవ రోజున లెనిన్ హిల్స్‌లో నున్న మాస్కోయూనివర్సిటీని దర్శించినాము ఈయూనివర్శిటీ బయటికి ఎంతోసుందరంగా నున్నప్పటికీ ఆరోజున ఆదివారం కావడం వల్ల మేము లోపల ఏమీ చూడలేకపోయినాము. అయినప్పటికి విశ్వవిద్యాలయము ఎంత పెద్దదో చెప్పవలెనంటే అక్కడి ఏదైనా ఒకరూములో జన్మించిన ఒకశిశువు భవనమంతా తిరిగివచ్చునప్పటికి ఒక సంవత్సరం వయసు రావచ్చునట. తరువాత అక్కడినుండి లెనిన్ మ్యూజియముకుపోయి మా కార్యక్రమములో లేకపోయినప్పటికీ ప్రత్యేకమైన అనుజ్ఞతో మేము అతిదీర్ఘమైన క్యూవరుసలను బేధించుకొని లోనికి పోయి లెనిన్ మహాశయుని దివ్యశరీరాన్ని అనగా అది నకలుశరీరము గాదు నిజమైన అసలు శరీరమును చూచి ఆనందించాము. విశాలమైన ఆభవనరాజములో భద్రపరుచబడియున్న ఆలెనిన్ మహాశయుని శరీరము చెక్కుచెదరక నిద్రించుచున్నవాని శరీరమువలెనున్న దానిని చూచి, నిశ్శబ్దముగా ప్రతిదినము దానిని దర్శించుచున్న వేలకొలది ప్రజలతో బాటు మేముగూడ ఆశ్చర్యముతో బయటకి వచ్చితిమి. తరువాత విచిత్రమైన ఒక ఈతకొలను (స్విమ్మింగు పూలు)ను చూచాము. దానిలో ఒక పర్యాయము (25000) ఇరువది యైదు వందల మంది ఈతగొట్టవచ్చును. దీనిలోని జలము 25% సెంటిగ్రేడుల వెచ్చదనముతో ఎల్లకాలమూ ఉండునట్లు ఏర్పాటుగలదు. ఈ అత్యద్భుతమైన సరోవరము దగ్గిరనే పెద్దపార్కుగూడ నిర్మించివుంది ఈపార్కు కీర్తిశేషులైన మాక్సిం గోర్కీపేరుమీద గోర్కీ పార్కు అనిపిలువబడుతోంది. దీనిలో చిన్నపిల్లల ఆటస్థలాలు మాత్రమేగాక 3. 4. ధియేటరులుగూడ వుంటాయి. వీనిలో ఒక పెద్ద ధియేటరులో దాదాపు రెండువేలమంది ప్రేక్షకులు కూర్చోవడానికి అవకాశం వుంటుంది. అక్కడ మా ప్రతినిధుల కొరకు ఒకప్రదర్శనము ఇవ్వబడింది గూడాను.

ఒక విచిత్రమైన విషయ మేమనగా రష్యావంటి ఒక విదేశములో మేము మా మధ్యవర్తులు లేనిదీ ఏవిషయమును గాని గ్రహింప లేకపొయ్యేవారము. ఈమధ్యవర్తులు సదా మావెంటనే వుండి రాత్రి పన్నెండు గంటలకు పక్కలమీద విడిచి మరునాడు 9 ఏ. యమ్.కు అంతావచ్చి అన్ని విషయాలు మాకు బోధబరుస్తూ మాకు ఏమికష్టము లేకుండా చేసేవారు. మా ఇండియా ప్రతినిధుల వెంట ఇద్దరు హిందీతెలిసిన మధ్యవర్తులుండి వారి ఉచ్చారణతో మాకు ఆనందాన్ని కలిగించేవారు.

మేము రెండు ముఠాలుగా విడిపోయి కొందరు కోపరేటివ్ ఫారములను దర్శింపగా కొందరము పయిసీర్ క్యాంపులు పరిశీలించి వచ్చినాము ఈపయినీరు క్యాంపులలో శిక్షణబొందుతున్న బాలబాలికలకు మేము స్టాంపులూ, పోస్టుబిళ్లలూ, గోరింటాకు, కుంకుమా ఇట్లాంటి చిన్న చిన్న వస్తువులను బహూకరించినాము.

మాస్కోనగరానికి మధ్యప్రదేశంలో ఉన్న ఒక పయినీర్ క్యాంపులో ఏడు దివ్యభవనాలు నిర్మింపబడి పిల్లలకొరకు సంవత్సర మంతా తెరువ బడివుంటాయి. వేలకొద్ది చిన్నపిల్లలు ఈ ఉపయోగాన్ని పొందూతూ నృత్యమూ, సంగీతమూ, చిత్రలేఖనమూ ఇట్లాంటి కళలను గూడా చదువుతోబాటు నేర్చుకోవచ్చును. పయినీరు లనగా కేవలము చిన్నపిల్లలకొరకె నడుపబడు సంఘములూ, సమాజములూను. మేము మొదటి రోజున ఈ పయినీరు బాలబాలికల చేత ప్రదర్శింపబడిన ఒక గానసభనుగూడ తిలకించితిమి. దాని యందు 3.4. సంవత్సరాల పిల్లల నుండి వేరు వేరు వయస్సుగలిగిన బాల బాలికలు పాత్రలుపహించినారు. వారు ప్రదర్శించిన అద్భుత ప్రదర్శనాలను చూచి ఆ చిన్ని శిశువులు ఈ రెండువేలమంది ప్రజల ముందు ఎట్లా నిర్భయంగా ప్రదర్శింపగలిగినారో అని ఆశ్చర్యం చెందినాము. వారి అద్భుతమైన నటనా చాతుర్యము, కౄరమైన వేషముల లోని శిక్షణా చాతుర్యమూ మమ్మలను మిక్కిలి ఆనందింప జేసినవి. ప్రపంచములోని అనేక దేశముల మాత్రుదేవతలైన మా ప్రతినిధులము మొట్ట మొదటి సారిగా మొదటి నాడే ఈ చిన్నపిల్లల ప్రదర్శనాన్ని జూచి ప్రేమోద్వేగాలతో పొంగిపోయినాము.

అక్కడ 'మాస్కోవా, నదీ తీరంలో వేశవికేంద్రాలు నిర్మింపబడి వుంటాయి. ప్రజలు అత్యుత్సాహంతో గుంపులు గుంపులుగా చేరి ఈమనోహరమైన వేసవిని అనుభవించుతూ, అక్కడ వేలకొద్ది ప్రజలను చూస్తూ అక్కడి సంతలలో కావలసిన పదార్థాలను కొంటూ కాలంగడుపుతారు.

మాస్కో నగరంలోని "భూగర్భయానం అయిన మెట్రో అన్‌డర్ గ్రౌండ్ రైల్వేను వర్ణింపడానికి" మాకు మాటలు చాలడంలేదు. భూతలానికి మూడువందల అడుగులలోతున నున్న అత్యద్భుతమైన ఈస్టేషనులలో నుండి ప్రయాణముచేస్తూ, రెండు వైపులనున్న చలువ రాతి అలంకారాలను దర్శించుతూ ఎంతో సంతోషాన్ని అనుభవించాము. ఈ భూగర్భంలో ప్రతి రెండు విముషాలకూ ఒకటిగా ఈ రైళ్లు అత్యంత వేగంగా పరుగెత్తుతుండగా, వీనిలో పోవడానికి ఏ ప్రాంతానికి పోవలసినా 5 కోపెక్కులు మాత్రము చెల్లించితే చాలు. టిక్కెట్ల కోసం ఈ నాణెములను మిషనులలోవేసి తీసుకొనవలసి వుంటుంది. అట్లా టిక్కెట్లు తీసుకొనకుండగాని ఒకవేళ మనము రైలు ఎక్కినయెడల ఆ ఆటొమేటిక్ యంత్రము, తనకు పడవలసినన్ని నాణెములు పడనిదే రైలును కదలనివ్వకపోవడంవల్ల రైలు ఆగిపోయి వుంటుంది. టిక్కెట్టులేనివారు సులభంగా దొరికిపోతారు గూడాను.

అన్నిటికంటే విచిత్రమైనది USSR స్టేటులో మాస్కో నగరంలోని శాశ్వత ప్రదర్శనశాల. ఈ ప్రదర్శనశాల సోవియట్ దేశములోని ప్రతిరాష్ట్రము ఎట్లా దినదినాభివృద్ధిని సాధించుతున్నాయో చక్కగా వెల్లడిచేస్తుంది. ఈ ప్రదర్శనస్థలము మాస్కోవా నదికి రెండు తీరాలల్లోనూ నిర్మింపబడి వుండడంవల్ల, అంటే ఈ ప్రదర్శనానికి మధ్యగా ఈనది ప్రవహించుతూ వుండడమువల్ల ప్రేక్షకులు జలవిహారాలను జరుపుచుండడమువల్లగూడా ఆనందాన్ని అనుభవించుతూ వుంటారు.

ఒక్కసారి వాయువిమానాలల్లో తిరిగి వియత్పథంలో అంటే మాస్కో ఆకాశవీధుల్లో తిరిగి ఆ నగరాన్నంతా

శ్రీమతి ద్వారకాబాయి

తిలకించిన తరువాత సుప్రసిద్ధమైన లెనిన్‌గ్రాడ్ నగరానికి ప్రతినిధుల మందరము బయలుదేరినాము.

అయితే ఇట్లా లెనిన్‌గ్రాడ్‌కు రైల్లో పొయ్యేటప్పుడు స్టేషనులో తమాషాగా మేము కొంతమందిమి ఆ రైలులో ఎక్కడం తప్పిపోయి, మేము మా మధ్యవర్తినులు అక్కడే వుండిపోయినాము. మా వెనువెంటనే వుండే ఫొటోగ్రాఫరు సహాయంతో మరొక్క గంటలో బయలుదేరిపోతున్న రెండవ రైలులో ప్రయాణంచేసి మేముగూడా మా ప్రతినిధులతో కలుసుకోగలిగాము.

లెనిన్‌గ్రాడు మనోహరమైన విశాలనగరము. ఎక్కడ చూచినా పరిశుభ్రంగా వుంటుంది. ఈ నగరంలో పురాతన జారు చక్రవర్తులనాటివి. రెండు రాజభవనాలు ఎంతో జాగ్రత్తగా రక్షింపబడుతూ వుంటాయి. వీనిలో ఒకటి వేసవి భవనము, రెండవది మతాధికారుల హెర్మిటేజి భవనమూ. ఇవి రెండు జార్‌చక్రవర్తులనాటి శిల్పాడంబరాన్ని వెల్లడిచేస్తూ వుంటాయి. వాటిని ప్రజలు ఎట్లా జాగ్రత్తగా చూచుకుంటున్నారో చూచినప్పుడు మనదేశంలో శిథిలము దుర్వినియోగమయిన చారిత్రక సంపదను, ప్రజాసంపదలనూ తలచుకొని విచారమును పొందినాము.

ఈ లెనిన్‌గ్రాడ్ లోనే ఒక సినీస్టూడియోకు పోయి అప్పుడు ఘూటింగు జరుగుతున్న ఒక సినీమాను గూడ తిలకించివచ్చాము. తరువాత సోవియట్ దేశపు సుందర నగరాలల్లో ఒకటైన కీవు నగరానికి వెళ్లాము ఇది దక్షిణ ప్రాంతంలో వుండడంచేత చలిబాధ చాలా తక్కువగా వుంటుంది. అందుకని భారీ ఎత్తున కూరగాయలను పండించే కేంద్రాలు ఎక్కువగా ఈ ప్రాంతంలో వుంటాయి. మా వెంటవచ్చిన మధ్యవర్తినులు తమగృహాలకు తీసుకుపోవడానికి చాలా చాలా కూరగాయలను తెచ్చుకొనడం చూచి ఏదేశానికి చెందినవారైనా మావలెనే ఈ మహిళలకు గూడా గృహముమీది అనురాగబంధము తప్పదుగదా అని భావించి ఆనందించినాము.

ఈ కీవు నగరంలో నున్న మరొక చూడదగిన విషయము బృహత్తరమైన భూభాగాన్ని ఆక్రమించి మూడు నాలుగువందల మంది బాలబాలికలూ, ఏబది అరువది మంది ఉపాధ్యాయిలూ హంగులు కలిగిన బ్రహ్మాండమైన సంస్థ. ఈ స్కూలులో 3 నుండి 7సం॥ వరకూ ఉండే బాల బాలికలకు స్నాన భోజనాలు గూడా అక్కడనే ఏర్పరచివారికి సంగీతము, నృత్యము, చిత్రలేఖనము, మట్టిపని మాత్రమేగాక, ఆటలు, పాటలు, ఈత, చిత్తుటవంటి ఉత్సాహకార్యములు మొదలైనగృహకృత్యములుగూడ నేర్పి, తోటలలో, పడవలలో త్రిప్పి దినమంతా వారిని ఆనందింప చేస్తూవుంటారు. ఈస్కూళ్లు రాత్రి $7\frac{1}{2}$ గంటలవరకూ తెరిచే వుంటాయి. గనుక వీరి తల్లులు దినమంతా పనిపాటలు చూచుకొన్న తరువాత తమ పిల్లలతో ఆనందించడానికి వీలుగావుంటుంది. అయితే ఇక్కడి ముఖ్యవిషయం ఏమంటే కిండర్‌గార్డెన్ సంస్థను నడుపడానికి కావలసిన ధనాన్ని రెండున్నర వంతులు ప్రభుత్వమూ, ఒకటిన్నర వంతును ఈ సంస్థ భరించినప్పటికీ, తక్కువగాబడిన ధనాన్ని ఆ దేశంలోని ట్రేడు యూనియనులు తమ నిధులలో నుండి కొంత సహాయం చేస్తూవుంటాయి. ఫీజులు చెల్లింపలేని బీద విద్యార్థులకు గూడా ఈ ట్రేడు యూనియనులు కార్మిక సంఘాలు వారికి సహాయం చేసి తోడ్పడుతారు. ఈ ట్రేడుయూనియనులు కేవలమూ ఉపన్యాసాలివ్వడము మాత్రం గాక ఇట్లా దేశానికి అవసరమైన అనేక సౌకర్యాలు సాధించుతూ వుంటాయి.

సాయింకాలము నీపానదిలో జలనిహారానికి పోయి బోటు షికారులో పాల్గొన్నాము. అక్కడ మమ్ములను అద్భుతపరచిన విషయం ఏమనగా, ఈనదీ జలము నిర్మలమైన వైను, ద్రాక్షారసంలాగా మిలమిల లాడుతూ ప్రవహించడం గమనించాము పైన వినీల నిర్మలంగా ఆకాశంతో పోల్చినప్పుడు, నల్లని ప్రవాహాలలో ప్రవహించే మన నదీ జలాలకు ఎర్రని నీటిలో ప్రవహించే ఈ నదీ జలాలకూ ఎంతో బేధం కనిపించి ఆశ్చర్యచకితులం అయినాము.

మేము రష్యాలో గడిపిన రెండువారాలల్లోనూ ఒక వారము రోజులు కాంగ్రెసు మహాసభలో గడిపినాము గదా. మరియొక వారం దినాలు, ఇట్లా రష్యాదేశములోని సుప్రసిద్ధ స్థలాలను దర్శించి ఆనందించినాము. అయితే రష్యనుల ఆదరపూర్వకమైన ఆతిధ్యమును గురించి కూడా కొన్నిమాటలు చెప్పకపోతే నా విద్యుక్తధర్మమును అతిక్రమించినదానను కాగలను. సోవియట్‌దేశపు మహిళల ప్రేమపూర్వకమైన స్వాగత సత్కారాలకు మేము ఎంతో కృతజ్ఞులమై వుంటాము. ఎక్కడకు మేము పోయినా ఏమాత్రము ఇబ్బందులూ లేకుండా ఎంతో ప్రేమతోను, స్నేహంతోను, క్రమబద్ధంగాను

మమ్ములను ఆహ్వానించి స్వాగతపరచెడివారు. ముఖ్యముగా ఆ మధ్యవర్తిని బాలికలు సదా చిరునవ్వులతో చిందులాడే సుందరముఖాలతో ఉదయం 9 గంటలనుండి రాత్రి 12 గంటల వరకూ, మా వెంటనే వుండి వారి వచ్చీరాని రష్యను ఉచ్ఛారణగల హిందీతో మాకు ఆనందాన్ని గలిగిస్తూ వుండేవారు. మేము ఎక్కడికిపోయినా వారి దేశాచారాన్ని అనుసరించి చక్కని పూలగుత్తులను బహుమానాలుగా సమర్పించుతూ వుండేవారు.

మేము ప్రతిదినము కాంగ్రెసులో పాల్గొనడానికి క్రెమ్లిన్ భవనంలో ప్రవేశించేటప్పుడు వేలమంది ప్రజలు రెండువైపుల నిలువబడి మా ప్రతినిధులందరికీ పూల గుత్తులు, రకరకాల బహుమానాలు సమర్పించేవారు.

ముఖ్యముగా మా భారతదేశపు ప్రతినిధుల చీరలు వారికి ఎంతో ఆకర్షణ, ఆనందమూ కలిగించేవి, ప్రజలు మేము ఎక్కడికిపోయినా, గుంపులు గుంపులుగాచేరి మా చీరలనూ వాని అంచులనూ చూచి సంతోషించేవారు. అందువలన మాకు ఎన్నో బహుమానాలు వస్తూవుండేవి. అయితే ఒక్కొక్కసారి ఈ బహుమానాలను గ్రహింపడానికి సంకోచాన్నిగూడా బొందేవాళ్ళము.

ఈ జ్ఞాపకచిహ్నలతో బయలుదేరి మా ప్రతినిధులమంతా విమానాశ్రయానికి వచ్చినప్పుడు తిరిగి అనేక బహుమానాలతోబాటుగ మా ప్రతినిధులందరికి, మా మా ఫొటోలు గలిగిన చక్కని ఆల్బములను బహూకరించడము జరిగింది.

ఈ బహుమానాలను సోవియట్ మహిళల ప్రేమ, ఆదరాలతోబాటుగా వెంట తీసుకొని జులై 6 వ తేదీన మా జన్మభూమిలో ఢిల్లీ నగరానికి చేరుకొన్నాము.

★

తుదికోర్కె



నిర్మల నిశీధిలో ఆరుబయట నుంచుని శూన్యజగత్తులోకి ఆశగా చూస్తున్నది ఒక స్త్రీ. కన్నీటినుంచి అశ్రుధారలు జారుతున్నాయి. అధరాలు వణకుతున్నాయి. ముఖమంతా పాలిపోతున్నది. ఆమె దుఃఖం చీకటిని బ్రద్దలుకొడుతున్నది. ఆ దుఃఖం నల్లటి పాషాణ హృదయాలను కరిగింపజేస్తుంది. ఏవో మాటలు అస్పష్టంగా ఆమె పెదాల మధ్య నలిగిపోతున్నాయి "యిదేరోజు. . యిదే రాత్రి—యిదే టైములో...." ఆ స్త్రీమూర్తి కంఠం మరింత హెచ్చింది 'భగవాన్! ఏమిటీ పరీక్ష?' ఎక్కడో సుదూరాన చిన్నవెలుగు! హృదయంలో మరో చిన్న దీపకళిక!! గతచరిత్ర తెల్లటి పల్చటి చీరలా పరచబడింది హృదయంమీద.

★ ★ ★

రాజ్యలక్ష్మికి పదహారు వసంతాలు నిండాయి. నిండుగా, అందంగా పూర్ణచందమామలా వుండేది. ప్రతి అవయవము సిగ్గుతో నాట్యమాడేది. ఆ నాట్యమే ఆమె అందాన్ని తీర్చిదిద్దింది. జీవితపు తొలివెలుగుల బాట వెంట నడిచే కాలమది. వింతవింత ఊహాలు, కలలు గనే కాలమది. స్త్రీ సౌందర్యాన్ని యినుమడింపజేసే కాలమది. కోర్కెల కొలనులో వికసించే తామరల కాలమది. తను ఎన్నో కలలుగంది. తానాశించినట్లుగా ఊహాలకు రూపాలొచ్చాయి. రాజ్యలక్ష్మి వివాహం వైభవంగా మధుతో జరిగిపోయింది. తన ఆశలకు, ఊహాలకు మరొకరు తోడొచ్చారు. ఎంతో సంతోషించింది. ఆ మధురక్షణం తలచుకుంటే చాలు చెక్కిళ్లు గులాబిలైపోయేవి ఆ క్షణం వచ్చింది. గదిలో అడుగు పెట్టింది. నిముషాలు నిశ్శబ్దంగా దొర్లాయి. ఆశ్చర్యపోయింది. మధు, కాదు తనభర్త! ఈ సమయంలో అసహాయుడై యేడుస్తున్నాడా? తడబడే కాళ్ళతో, వణకు చేతులతో ధైర్యంగా నుదుటమీద చెయ్యివేసింది. "రాజ్యలక్ష్మి" అన్నాడు హీనస్వరంతో.

రాజ్యలక్ష్మికి ఏం మాట్లాడాలో తెలియలేదు. అలాగే చెయ్యివేసి నుంచునుంది. రాజ్యలక్ష్మి చేతులు తనలోకి తీసుకుని "నన్ను క్షమించు" అన్నాడు బాధగా. కన్నీటి చుక్కలు నయనాలలో దాక్కోలేక రాజ్యలక్ష్మి చీరమీద పడ్డాయి.

"బాధపడకండి."

"........."

"ఏం జరిగింది. నాతో చెప్పకూడదా?"

"ఏం చెప్పను. నేను మహాపాపిని."

"ఏడవకండి" అంటూ పమిటతో కనులు వత్తింది.

"నన్ను క్షమించు రాజ్యలక్ష్మి నీకు తీరని ద్రోహం చేశాను. వనజకు, నా వనజకు అన్యాయంచేశాను.... ఎంతో గాఢంగా ప్రేమించుకున్నాము. పెళ్ళి చేసుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్నాము. కాని....నేను అశక్తుడ్ని, పిరికివాడిని, ఈ సంఘానికి, మనుష్యులకు జడిశాను. వనజ అజ్ఞాతంగా గడపవలసివచ్చింది. నాలో నేను కుమిలిపోయేవాడిని. కొన్నాళ్ళకు వనజ గర్భం

దాల్చింది. ఈ పరిస్థితులలో ఏంచెయ్యాలో తెలియలేదు. ఈ కల్మష సమాజాన్ని వీడి వనజతో ఎక్కడికైనా ప్రశాంత వాతావరణానికి వెళ్ళిపోదామనుకున్నాను. కాని,....భగవంతుడు నన్ను శపించాడు. వనజ...నా వనజనన్ను వీడి మరోలోకానికి వెళ్ళిపోయింది. ఎంతో యేడ్చాను. పిచ్చిగా తిరిగాను. ప్రేమించిన యువతిని వివాహం చేసుకోలేక పోయాను. నాబాధ ఎవరికర్థమవుతుంది? వనజ చివరి గడియల్లో "పెళ్లిచేసుకోండి. నావలన మీరు చాలా బాధలుపడ్డారు, నన్ను మరచిపోండి" అంటూ యేడ్చింది, నాజ్యోతి ఆరిపోయింది. నాకు తెలియకుండానే ఈ వివాహంనిర్ణయించారు. వద్దని ఎంతోచెప్పాను బ్రతిమిలాడాను. విధికితలవంచాను. మన వివాహం జరిగిపోయింది. నా వనజను మరచిపోలేను. ఆమెకు ద్రోహం చేశాను. నన్నెన్నటికి క్షమించదు" అంటూ రాజ్యలక్ష్మి వక్షంలో వాలిపోయాడు.

రాజ్యలక్ష్మికి ఏంచెయ్యాలో తెలియలేదు. భర్తకు ఏవిధంగా ధైర్యం చెప్పాలోకూడా తెలియలేదు "విచారించకండి. జరిగిపోయింది కలగా భావించండి. ఎందరో పవిత్ర ప్రేమమూర్తులు యిలాగే గడచిపోయారు. విచారించి లాభంలేదు. గతాన్ని మరచిపోయి. వర్తమానాన్ని అర్థంచేసుకోండి" అంది,

జీవితచరిత్రలో కన్నీటి దుఃఖాలుగాని, ఆనంద బాష్పాలుగాని కొద్దికాలమే నిలుస్తాయనుకుంటాను. జీవితంలో ఏది సాధించలేమని నిరుత్సాహపడతామో, అదే సాధించగలిగిన నాడు దాని పరమార్థం చూచాయగా కనుదోయిముందు కదలుతుందనుకుంటాను.

★ ★ ★

రోజులు, వారాలు, నెలలు గడచిపోయాయి. రాజ్యలక్ష్మి సాన్నిధ్యంలో వనజను మరచిపోయాడనే చెప్పవచ్చేమో, అయితే వనజ అతని హృదయాంతరాలలో నుంచి అంతతొందరగా తొలగిపోలేదు. దానికి ఎన్నో సంఘటనలు అనుకూలించాయి, అప్పటికి వివాహం జరిగి కొద్దిరోజులుమాత్రమే అయింది.

సూర్యుడు పశ్చిమ దిశలోకి భారంగా, విచారంగా కృంగి పోతున్నాడు. పచ్చికబయలు మీదపడుకుని గగనంలోకి తదేకదృష్టితో చూస్తున్నాడు మధు. చెట్టు మీదనున్న జంటపక్షులు పోట్లాడుకుంటున్నాయి. మేఘాలు ఆడుకుంటున్నాయి. అతని ముఖకవళికలు మారుతున్నాయి. ఏదో హృదయంలో గుచ్చుకుంది. రక్తం చిమ్మింది. నయనాలు తడిశాయి. రాజ్యలక్ష్మి భర్తను వెతుక్కుంటూ భర్తను చూచింది. ఎందుకో ఆమె హృదికూడా బాధగా దీర్ఘరోగిలా మూలిగింది. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి ప్రక్కన కూర్చుని చెయ్యి వేసింది. మధుచూచాడు. నిట్టూర్పు విడిచాడు. అతని నయనాలు యింకా కన్నీరు నింపుతున్నాయి.

"ఎందుకిలా బాధపడతారు: గతించినవారు తిరిగిరారు కదా?"

"...... ...."

"బాధపడి ఏం ప్రయోజనం? మనసులు పాడుచేసుకోవడం తప్ప మరేమయినా వుందా?"

"నీకు తెలియదు లక్ష్మి"

"ఆమెగూర్చి అలా బాధపడితే మీ పరిస్థితి ఏ స్థితికి వస్తుందో తెలుసా"

"............ ...."

"ఏమిటాలోచిస్తున్నారు? "

"అదే ......వనజ ....నా ...."

"ఆమెను నెమ్మదిగ మరచిపోవడానికి ప్రయత్నించండి"

"అదిసాధ్యం కాదు రాజ్యం"

"అయితే ఎప్పుడూ యిలాగే జీవితాంతం బాధపడుతూగడుపుతారా?"

"......................"

"ఒకసారి మీరే ఆలోచించండి"

"రాజ్యలక్ష్మి" అంటూ విసురుగా లేచివెళ్ళిపోయాడు మధు. మధువెళ్ళినవేపే నిరాశగా చూస్తు కూర్చుండిపోయింది. యిటువంటి సంభాషణలె వారిద్దరిమధ్య రెండుమూడూసార్లు జరగడం మధు విసురుగా లేచివెళ్ళిపోవడంకూడా జరిగింది.

****

శ్రీ యస్. రామారావు

****

అది అర్ధరాత్రిసమయం

నిశిలోనింకు చంద్రుడు ఉదయించడంలేదు. రాజ్యలక్ష్మి కళ్ళు ఎరుపెక్కి బరువుగా వున్నాయి. దీర్ఘంగా ఆలోచిస్తోంది నిముషాలు బరువుగా రాజ్యలక్ష్మి హృదయం మీద కొడుతున్నాయి. జలజలమంటూ కన్నీటి చుక్కలు జారాయి, నిట్టూర్చింది.

తన భర్త వనజను మరచిపోలేడా? తనలో మధును మార్చగలిగే శక్తి లేదా? ఏమో తను ఎన్ని ప్రయత్నాలు చేసింది? ఈ జీవితం యిలావంటరిగా వాడిపోవలసిందేనా? భగవాన్ యిక వారిభారం మీ మీదనే వుంచాను. నేను చెయ్యవలసిన ప్రయత్నాలన్ని చేశాను. ఎప్పటికైనా, ఏనాటికైనా వారిలో పరివర్తన వచ్చేటట్లు అనుగ్రహించండి అంటూ కళ్ళుమూసుకుంది. చెక్కిళ్ళమీదుగా కన్నీటి చారలు కట్టాయి. ఎక్కడో దూరాన 12గంటలు కొట్టిన చప్పుడు నిశ్శబ్దాన్ని బ్రద్దలుకొట్టింది. రాజ్యలక్ష్మి టేబులుమీద వాలిపోయింది. ఎంతసేపుగడిచిందో ఏమో? తల మృదువుగా నిమురుతూ "రాజ్యలక్ష్మి" అన్నాడు.

ఆమెలో ఎటువంటి చైతన్యంలేదు.

"రాజ్యలక్ష్మి" అన్నాడు మాలిమితో.

ఏదో పీడకల వచ్చినట్టుగా భయంగా లేచింది. ఆశ్చర్య పోయింది. తన ఏదుట తన భర్త — మధు. ఎందుకో ఆమె కంపించి పోతోంది.

"లక్ష్మి. ఏమిటలా వణికిపోతున్నావు?"

'ఏమీలేదు.'

'నీకుచాలా అన్యాయం చేశాను. నిన్ను కష్టపెట్టాను. నీ యెడలచాలా మూర్ఖత్వంగా ప్రవర్తించాను.

ఈ మాటలకు ఆమె హడలిపోయింది. తన భర్త అంటున్న వేనా? గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. తలవాల్చి వేసింది.

"ఏం మాట్లాడవు రాజ్యలక్ష్మి. యింతకాలం నేనొక మూర్ఖుణ్ణిగా ప్రవర్తించాను. నిన్ను అర్ధంచేసుకోలేక పోయాను. ఎన్నోసార్లు నువ్వుచెప్పె విషయాలను లక్ష్య పెట్టలేదు. యింతకాలం నేనొక పిచ్చివాణ్ణిగా ప్రవర్తించాను. తరువాత తరువాత నువ్వుచెప్పే ప్రతిమాటా నా గుండెల్లో హితాన్ని స్రవింపజేసింది. ఎంతో ఆలోచించాను. నీ కన్యాయం చేస్తున్నానని ప్రతి అణువునన్ను హెచ్చరించింది. ఎన్నోరాత్రులు దీర్ఘంగా ఆలోచించాను. నన్ను మానవుణ్ణిగా గుర్తించగలిగేటట్లు చేశావు. లక్ష్మి యింకెప్పుడూ యిలా ప్రవర్తించను. నన్ను క్షమించు లక్ష్మి అంటూ ఆవేశంగా చేతులు పట్టుకున్నాడు. అతని కళ్ళల్లో దుంఖాశ్రువులు జారిపోయాయి.

ఈ మాటలు తన భర్త అంటున్న వేనా? నమ్మలేక పోతోంది. భగవాన్! వారిలో అంతటి పరివర్తన కలిగిందా?

"నన్ను క్షమించవా లక్ష్మి?" ఈ మాటలు పిల్లవాడు చిరుతిండి కోసం చెయ్యిచాచినట్లుగా వున్నాయి.

"అవేం మాటలండి: మీరేంచేశారని: గడబిడంతా మరచిపొండి. నేనెప్పుడూ మీ పాదదాసినే. నన్ను అనుగ్రహించారు. అంతేచాలు" అంటూ రాజ్యలక్ష్మి మధు పాదాలమీద వాలిపోయింది.

"లక్ష్మి యేడుస్తున్నావా?" అంటూ ఆమెను లేవనెత్తాడు

"కాదు. యిది నాజీవిత భవిష్యత్తుకు మొదటి సోపానం. మీలో పరివర్తన కలగదేమోనని ఎంతో దుఃఖించాను, బాధపడ్డాను భగవంతుడు నామొర విన్నాడు" అంది సంతోషంతో. ఆ సంతోషానికి పోల్చదగింది మరేది లేదేమో!

"లక్ష్మి ఒకసారి నవ్వు" అన్నాడు.

"ఉహు"

"నవ్వవా?"

రాజ్యలక్ష్మి నవ్వింది ఆనవ్వులో వెన్నెలవికసించింది.

★ ★ ★

అది హాస్పిటలు.

ప్రశాంతంలో ప్రళయం రేపుతు రోదిస్తూ ఒక మూర్తి యిటేవస్తున్నది. ఆమె చూపులు ఖంగారు పడుతున్నాయి. జుట్టంతా చిందరవందరగా వుంది. ఆమె కాళ్ళు గదులవెంట, కళ్ళలోనికి ఆత్రుతగా తొంగి చూస్తున్నాయి. ఆమె ఒక గదిముందు ఆగింది. లోనికి అడుగిడబోయింది. వెయ్యలేకపోయింది. ఆమె అధరాలు వంకరపోతున్నాయి. ఒకసారి గదిని బాధతో పరికించింది. పేషెంట్ బెడ్ ప్రక్కగా యిద్దరు డాక్టర్లు చేతిలో

ఇంజక్షన్స్, ఏమిటో?అందరు సీరియస్‌గా వున్నారు. గుమ్మందగ్గర ఆశ్రీ హృదయవేగం హెచ్చింది. నీరసంగా గోడకుఆనుకుంది. ఆమె.... ఆమె ... రాజ్యలక్ష్మి! రోగి బాధతో మూలిగిన ధ్వని. రాజ్యలక్ష్మి నెమ్మదిగా లేచి తడబడే కాళ్ళతో లోన అడుగుపెట్టి భర్త మీదవాలి పోయింది. ఆమెయేడ్పులు నిశ్శబ్దంతో పోట్లాడు తున్నాయి. కొద్దిక్షణాలు గడిచాయి. చుట్టూ కలయ చూచింది. అక్కడ ఎవరూలేరు. లైట్లకాంతిలో భర్తను చూచింది. కాళ్ళకు బలమైన గాయాలు తగిలాయను కుంటాను కట్టుకట్టివున్నాయి. భర్తముఖంలోకి చూచింది.

"ల....క్ష్మి'' అన్నాడు బాధగా మధు.

"నేనండి మీరాజ్యలక్ష్మిని" అంది.

"ఏడుస్తున్నవా లక్ష్మి?"

''.........................."

"విధిని జయించలేము. ఈనాటితో నాజీవితం రాలిపోవాలనివుంది. అందుకే ఈ కారుప్రమాదం, మనంకేవలం మానవ మాత్రులము. ఈ – చావునుంచి తప్పించుకోవాలని ప్రయత్నించడం అవివేకమే. యేడవకు లక్ష్మి" అన్నాడు. రాజ్యలక్ష్మి పెల్లుబికివచ్చే దుఃఖంతో మధు వక్షంమీద వాలిపోయింది.

"చూడులక్ష్మి. ఈ రెండు సంవత్సరాలలో ఒకరోజు కూడా నీకుసంతోషాన్ని కలిగించలేకపోయాను నీకెంత చేరువగా రావాలని ప్రయత్నించానో అంతదూర మయ్యాను. యిప్పుడు శాశ్వితంగా దూరమవుతున్నాను. లక్ష్మి... ఒక్కమాట ...."అతనిగొంత జీరపోయింది, పెదాలు తడారిపోయాయి. ఏమిటన్నట్లుగా భర్తముఖం లోకి చూచింది రాజ్యలక్ష్మి.

"చేతిలోచెయ్యి వెయ్యిలక్ష్మి" అన్నాడు ఆమెవేసింది వణికేచేతులతో.

"నా ఈ తుదిక్షణాల్లో ఒక చిన్నకోరిక. నువ్వు తప్పక తీర్చు...నువ్వు...మరొకరిని వివాహంచేసుకో'' రాజ్యలక్ష్మి పెల్లుబికివచ్చే దుఃఖంతో మధు వక్షంమీద వాలిపోయింది.

రాజ్యలక్ష్మి గుండెలుప్రక్కలైపోయాయి: తనభర్త అంటున్న మాటలేమిటి? పెద్దగాయేడుస్తు ఆమెలేచి వెళ్ళపోబోయింది, మధు ఆమెనువారించి "లక్ష్మి, యింకా పూర్తిగానీకు ఇరవైసంవత్సరాలు నిండలేదు. జీవిత సుఖాన్ని పొందలేకపోయావు. మిగిలినజీవితాన్ని ఈ మూఢనమ్మకం కొరకు బలిచెయ్యవద్దు. నామాటవిని నీకునచ్చిన వివాహంచేసుకో" అన్నాడు. కొన్నినిమిషాలు నిశ్శబ్దంగా దొర్లిపోయాయి. రాజ్యలక్ష్మి తలవంచుకుని భర్తకాళ్ళదగ్గర కూర్చునుంది.

"లక్ష్మి ''అన్నాడు.

తలయెత్తిభర్తదగ్గరకువెళ్లితలనిమురుతూకూర్చుంది.

"నాచివరి గడియ .... సమీపించింది. నిన్ను .... కష్ట పెట్టాను క్షమించు. నేను చెప్పినవి గుర్తుంచుకో .... మరచిపోవద్దు. నేను చెప్పినట్లుగానే చెయ్యి ... అ .... ''అబ్బా అంటూ గుండెపట్టుకుని బాధగా నిరాశగా రాజ్యలక్ష్మి ముఖంలోకి చూచాడు అతనికి నొప్పి ఎక్కువైంది. మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడు. ఆయాసం ఎక్కువైంది, కళ్ళలో కన్నీరుగూడు కట్టుకున్నాయి. తృప్తిగా ఒకసారి నవ్వుకున్నాడు. అంతలోనే బాధ.

''లక్ష్మి'' అన్నాడు బాధగా అతిప్రయత్నమీద. అంతే అతని కళ్ళుమూసుకున్నాయి. అతని శిరస్సు ప్రక్కకు వాలిపోయింది. యేడుస్తూ రాజ్యలక్ష్మి మధు మీద వాలిపోయింది.

లైట్లు ఆరిపోయాయి.

ఎక్కడో గంటలు మ్రోగుతున్నాయి,

తీతువ అరచింది.

చీకటి! చీకటి !! అంతా చీకటి !!!

★



కృష్ణవేణి

ఆంధ్రదేశము రత్నగర్భమై సస్యశ్యామలమై ప్రగతి మార్గమున విజృంభించుటకు ముఖ్య ప్రాతిపదిక యందలి ప్రధానమైన జీవనదులు, అవియే గోదావరీ, కృష్ణవేణీ, తుంగభద్రలు, వీని జలములు యావదాంధ్రభూమి యందును— తెలంగాణము, సాగరతీరము, రాయలసీమ- ప్రయోజనకారి యగుచున్నవి. గోదావరి మహారాష్ట్రమునందును నాంధ్రదేశమున పూర్వభాగమున వుభయ గోదావరీ మండలములందును ప్రవహించుచున్నది; కృష్ణవేణీ తెలంగాణము, రాయలసీమ, సాగర ఆంధ్రమును ఫలప్రదము జేయుచున్నది. గోదావరి గంగానదికి సాటి; కృష్ణవేణియో, యమున కెంతమాత్రమును తీసి బోదు. రాధాకృష్ణుల రాసక్రీడలచే పునీతమైనవి యమునా తటములు; కృష్ణనామ సమ్మోహనాస్త్రముచే చకితమై, పులకించినవి కృష్ణవేణీ తీరములు. యమునాతీరమున మధురలోవలె, కృష్ణాతీరమున అమరావతియందు కళాసంపద విశ్వవిఖ్యాతిగాంచినది; నాగార్జునుని యనుభూతివలన నమరకీర్తి బొందినది నాగార్జునకొండ. బౌద్ధమునకు, వీరశైవము, విరవైష్ణవములకు నిలయములైనవి కృష్ణా పరిసరములు. కృష్ణవేణమ్మ పేరు ఆంధ్రులలో పరిపాటి.

అష్టగంగలనబడు గంగా, యమున, గోదావరి సరస్వతి, నర్మద, సింధు, కావేరీనదులలో కృష్ణవేణి యమున గోదావరుల మధ్య చేర్కొనబడినది. దక్షిణమునుండి వుత్తరమునకు యెంచబడిన పంచగంగలనబడు నదులైనకావేరి, తుంగభద్ర, గౌతమి, భాగీరథి-వీనిలో తుంగభద్రకు గౌతమికి మధ్య జెప్పబడినది కృష్ణవేణి. కృష్ణపదమునకు నల్లనిఛాయ యని యర్థమగుటచే, కృష్ణానది ప్రవహించు కృష్ణభూమి-అనగా నల్లరేగడభూమి కరెనాడును బట్టి యానామము, రూఢమైయుండును. అంతియగాక నదికి కృష్ణ సంపర్కము తెలవాహాయను నామాంతరము స్ఫురింపజేయుచున్నది; కృష్ణుని మేని నువ్వులనూనె వలన మిలమిలలాడు చున్న ప్రవాహమని భావము. రామాయణము కిష్కింధా కాండములో నర్మద, గోదావరి, తామ్రపర్ణిలతో బాటు కృష్ణవేణీ నామముగలదు. గోదావరిని Goaris అనియు, కావేరిని Khaberos యనియు జెప్పిన Ptolemy కృష్ణను Maisolas అనియు, వుపనది భీమను Benda యనియు జెప్పియున్నాడు.

కృష్ణానదినిడివి 800 మైళ్లు. పశ్చిమకనుమలలో అరేబియను సముద్రమునకు 40 మైళ్లదూరమున మహాబలేశ్వర పీఠభూమి తూర్పు భాగమున సతార్‌కు 33 మైళ్లు వాయవ్యముగ నొక యంచున జన్మించుచున్నది. ప్రవాహము ఒక శిలానిర్మిత ధేనువు నోటినుండి నచటి ప్రాచీన శివాలయమందలి యొక చిన్న జలాశయము లోనికి బడుచుండును. నది తూర్పునకును, కొంత దక్షిణమునకును ప్రవహించి తర్వాత నైరుతి దిశకు వంపుదిరుగుచున్నది; సతారాకు 3 మైళ్లు తూర్పున మాహులియొద్ద వెణా (యెణ్ణా)నదిని కలుపుకొనుచున్నది. అటుపిమ్మట కృష్ణ, మహాభారతమున కరహాటక్ మనబడిన కరాడ్‌ను దాటిపోవుచు దక్షిణపార్శ్వమునుండి Koina నదిని జేర్చుకొనుచున్నది. సాంగ్లికి దక్షిణమున

3 మైళ్ళ దూరమున వర్ణానది కృష్ణలో సంగమించుచున్నది. అంతటినుండి బీజపూరు మండలము ప్రవేశించిన పిమ్మట సహ్యాద్రులలో ఘాట్ప్రభ, మాల్ప్రభ యను రెండు చరిత్ర ప్రసిద్ధమైన ప్రవాహములు కృష్ణవేణిని గలియుచున్నవి. ఇచటినుండి కృష్ణవేణి కొండలలో పరువులిడుచు, తీవ్రవేగమువలన గాలిలోనికి నీటిని విరజిమ్ముచు కొండలక్రింద యగాధమైన గుండములలోనికి దుముకుచున్నది.

హైదరాబాదు రాష్ట్ర ప్రవేశముతో కృష్ణవేణి పీఠభూమిని వదలి ప్రవహింపుచు షోరపూరు, రాయచూరు కోనల నిర్మింపుచున్నది. పూనా మండలములో సహ్యాద్రులలో భీమశంకర దేవాలయము సమీపమున జన్మించు పండరిపుర క్షేత్రము పదిగరముల ప్రవహింపుచి వచ్చిన భీమానది కృష్ణతో గలియుటవలన షోరపూరు కోన యేర్పడుచున్నది. ఉపనదులలో భక్త తుకారాముకు పరమపవిత్రమైన దేహుమీదుగ ప్రవహించు యింద్రాయణి, జ్ఞానేశ్వరుని నిలయమైన అలందీ, పూనా పార్శ్వమున ప్రవహించు మూలముథా, తోర్ణాదుర్గమున్న కొండనుండి ప్రవహించు నీరా, అహ్మదునగరము ప్రక్కగా బోవు సినా, చరిత్రఖ్యాతిగన్న మాన్యఖేటము సమీపమునబోవు కొగ్నా గలవు. కృష్ణా తుంగభద్రా సంగమమువలన రాయచూరు కోన మేర్పడుచున్నది. కృష్ణానది హైదరాబాదు నుండి తూర్పుకి మళ్ళి కర్నూలు మండలములో అలంపురమునకు కొంతదూరమున దక్షిణము నుండి వుత్తరమునకు ప్రవహించు తుంగభద్రను గలుపుకొని సంగమేశ్వరమునుండి నల్లమల కొండలద్వారా తూర్పు కనుమలను దాటి శ్రీశైలము నొరసికొనుచు తీవ్రగమనమున ప్రవహింపుచున్నది. ఇచటి కృష్ణను పాతాళగంగ యందురు. తదుపరి హైదరాబాదు నదియైన మూసిని, పాఖాల సరస్సునుండి ప్రవహించు మాద్గల్య యనబడు మున్నేటిని జేర్చుకొని గుంటూరు, కృష్ణా మండలముల గుండా ప్రవహించి విజయవాడయొద్ద రెండు రాతి కొండల నడుమ 6 ఫర్లాంగులు విస్తృతమై ప్రవహింపుచు, అటనుండి 40 మైళ్లు దూరమున కృష్ణ మచిలీపట్నము సామీప్యమున రెండు పాయలుగ జీలినది; హంసలదీవి కడ బంగాళాఖాతములో గలియుచున్నది. రెండు పాయలకు నడుమ దివియను ద్వీపమేర్పడినది; రెండు పెద్ద డెల్టాలును యేర్పడినవి; తూర్పు డెల్టా కొల్లేటి వరకును 1060 చ. మైళ్ళ పర్యంతమును, పడమటి డెల్టా 950 చ. మై. మేరను వ్యాపించినవి.

కృష్ణానది పశ్చిమమునుండి తూర్పునకు దక్షిణాపథము నంతటిని తన ప్రవాహములో దాటుచున్నది. హైదరాబాదు రాష్ట్రమునకును యితర ఆంధ్ర జిల్లాలకును 180 మైళ్ళు కృష్ణానది సరిహద్దు యగుచున్నది, కృష్ణా,గుంటూరు మండలముల మధ్యసీమగ ప్రవహించు చున్నది. ఇంచు మించుగ 200 మైళ్లు కృష్ణ గుంటూరు మండలమున బారుచున్నది. కృష్ణా, గోదావరులతో కొట్టుకొని వచ్చు మట్టివలన తీరప్రాంత భూములు విశాలములై, సారవంతమై యున్నవి. మిక్కుటమైన కొండశిలలవలనను, అతితీవ్రమైన ప్రవాహమువల్లను కృష్ణానదిలో ప్రయాణసౌకర్యములకనువుస్వల్పము, నీటివసతియునుకృష్ణకు గోదావరి, కావేరి నదులకంటె యధికముగాదు.

కృష్ణకు బెజవాడయొద్ద అడ్డముగ ఆనకట్ట నిర్మింపబడినది. ఇచట వేసవిలో కృష్ణప్రవా

శ్రీమతి వారణాసి యశోదాదేవి

హము 6 అ. లోతు మాత్రమే యుండును; కాని ప్రవాహము వచ్చినపుడు 40 అడుగుల వరకు హెచ్చును. ఆనకట్టకు పెట్టుబడి రూ. 132,00,000 నీరు సుమారు 95,000, చ. మైళ్ళు భూమికి వుపయోగ పడుచున్నది. రెండు ముఖ్యమైన పంటకాలువలలో వామపార్శ్వపు కాలువ రెండుపాయలగు చున్నది; వానిలో నొకశాఖ 39 మైళ్ళు నిడివిగల్గి యేలూరు వరకును బ్రవహింపుచు; గోదావరి నుండివచ్చే పడమటి కాలువను కలియు చున్నది. రెండవశాఖ 49 మైళ్ళు మచిలీ పట్నమునకు బ్రహించు చున్నది. దక్షిణతీరమందలి కాలువనదికి సరాసరిగ బ్రహహింపుచు రెండు ముఖ్యశాఖలను నిజాంపట్నము కొమమూరులకు బంపుచున్నది. కాకినాడనుండి మద్రాసుకుబోవు బకింగుహాము కాలువను, గోదావరి కాలువను కృష్ణకాలువ కలుపుచున్నది కృష్ణానది ముఖ్యమైన కాలువల మొత్తము నిడివి 349 మైళ్ళు; తూర్పు డెల్టాలో 5,80,000 ఎకరముల భూమియును, పడమటి డెల్టాలలో 3,88,000 ఎకరముల నేలయు, మొత్తము 968000 ఎకరములభూమి కృష్ణానీటి వలన సాగు అగుచున్నది. కృష్ణకాలువలో యేడాదికి 10 నెలల పడవలు బోవుచుండును. 12 లక్షల విలువ గల కలప వ్యాపారము, 3 కోట్ల 40 లక్షల విలువగల యితర వ్యాపారమును ప్రతియేటా సాగుచుండును. కృష్ణ ఆనకట్టకు వ్యయమైన 2 కోట్ల 20 లక్షల రూప్యములమీద ప్రభుత్వమునకు సాలీనా 13% లాభము వచ్చుచున్నది.

కృష్ణనది ప్రతిదినము 5 చ. మైళ్ళ ప్రదేశము మీద ఒక అడుగు మందమున వేయుటకు చాలినంత యొండుమట్టిని దెచ్చుచున్నది. కాబట్టియే వరి యితరధాన్యములు, దూది, పొగాకు, చెరకు మొదలైన పంటలతో కృష్ణమండలము ఫలవంతమైనది. కొద్దికాలము క్రిందటివరకును దివి ద్వీపములోని భూములకు నీటి వసతిలేక ఇంజినులలో నీరు సరాఫరా జేయబడు చుండెను. 1935 సం॥ లో పులిగడ్డ ఆనకట్ట నిర్మింపబడిన వెనుక తూర్పుగట్టు కాలువ త్రవ్వబడెను. ఈ కాలువ బందరు కాలువకు 4 మైళ్ళ దూరముగ కృష్ణాతీరమున బ్రవహించి పులిగడ్డ ఆనకట్టమీదుగా బోయి దివి ద్వీపమున కంతటికిని నీటి వసతి గల్గించు చున్నది. దీనిఫలితముగ 77,000 ఎకరముల భూమి పంటల నిచ్చుచున్నది.

కాని గోదావరి నీటిలో 6%, కృష్ణాజలములు 7% మాత్రమేసాగుబడికివుపయోగించుచుండెను. కాబట్టి ఆంధ్రప్రభుత్వము కృష్ణాబారేజి నిర్మించినది. విజయవాడవద్ద ఆనకట్టపై యిప్పటి తలుపులకు పైభాగములో యిప్పటి రిగ్యులేటరులో నొక్కొక్కటి 40 అడుగుల వెడల్పుగల 70 ద్వారములు నిర్మింపబడినవి. ఇందువలన కృష్ణామండలములో 46,000 యెకరములు, గుంటూరు మండములో 71,000 యెకరముల భూమియు నీటి పారుదలను బొందుచున్నవి. నాగార్జున సాగర్ ప్రాజక్టువలన నదీజలములు వృథా పోకుండా కృష్ణానదిమీద నంది కొండ వద్ద రిజర్వాయరు, ఆనకట్టకు యిరు పార్శ్వములందును రెండు కాలువల నిర్మాణము జరుగుచున్నది. ఈ ప్రాజక్టుకు 122,02 కోట్ల రూప్యములు వ్యయమగునని అంచనా వేయబడినది. ఇందువలన తెలంగాణము, సాగరతీర ఆంధ్రమునలందును 31,83 లక్షల యెకరముల భూమి ఫలప్రదమగును. నాగార్జున సాగర్ ప్రాజెక్టుతో పాటు శ్రీశైలం ప్రాజక్టు సంపూర్ణమైనపుడు యీరెండువిద్యుత్కేంద్రములు ఆంధ్రరాష్ట్రమంతటను వివిధ పరిశ్రమలకు విద్యుచ్ఛక్తిని లభింపజేయగలవు. కృష్ణపై సిద్ధేశ్వరము, పులిచింతల జలాశయముల వలెనే నాగార్జునసాగర్ కు యెగువను శ్రీశైలమువద్ద మల్లిఖార్జున దేవాలయ సమీపమున కృష్ణానదికి అడ్డముగా 400 అడుగుల యెత్తున ఆనకట్ట నిర్మింపబడును. వానివలన పావన కృష్ణాతోయములు ఆంధ్రులసౌభాగ్యమునకు యింకను యెంతో సహాయపడును.

కృష్ణనైసర్గిక రూపము దక్కనును రెండుగ విభజింపుచున్నది. దక్షిణ దక్కను కడపనుండి గుత్తివరకును, గుత్తినుండి వుత్తరముగ కృష్ణ వరకును, యటనుండి నది వామపార్శ్వమునకును వ్యాపించి యున్నది. చారిత్రకముగ కృష్ణాతటములు భారతీయ సంస్కృతికేగాదు, ఆంధ్రత్వమునకు నిధానములు; ఇచట రూపొందిన ఆంధ్ర సర్వస్వము దేశదేశముల వ్యాపించినది. ప్రప్రథమ ఆంధ్రసామ్రాజ్యమైన ఆంధ్ర శాతవాహన సామ్రాజ్యపు రాజధాని కృష్ణవేణీతీరమున అమరావతి ధాన్యకటకము వీరికాలమున నీ ప్రాంతమున బౌద్ధమతము మహోన్నతదశ ననుభవించినది. కృష్ణకు కుడివైపున 80 మైళ్ళు నది సరిహద్దుగా గల పల్నాటిలోని పారాయి, అమరావతి, నాగార్జునకొండ, గోలి, గుమ్మడిదుఱ్ఱు, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, అల్లూరుల యందలి విశిష్టశిల్ప సముచ్ఛయమునకు కారణభూతమైనది. బుద్ధజాతక కథలు అమరావతీ చైత్యమున శిల్పాంకితమైనవి. శాతవాహన హాలచక్రవర్తి (క్రీ. శ. 19-24) గాథాసప్తశతిని సంతరించెను. ఇందలి 700 గాథలలో అణులక్ష్మి, అనుపలబ్ధ, రేవ, మాధవియను విదుషీమణుల రచనలును గలవు. శాతవాహనుల పిదప యిక్ష్వాకు చక్రవర్తులు క్రీ. శ. 3వ శ॥న యీ ప్రాంతముల బాలించిరి. వీరి రాజధాని విజయపురము. వీరి కాలమున నాగార్జునాచార్యుడు శ్రీ పర్వతమున వసించుచుండెను. అదియే కృష్ణా దక్షిణతీరమున మాచెర్లకు 15 మైళ్ళ దూరమునందున్న నాగార్జునకొండ. ఇది 200 మైళ్ళ విస్తృతిగల్గి వున్నతమై చదునైన కొండ. ఇందు ఇక్ష్వాకురాణులు, రాకుమార్తెలు యితర దేశములందు బౌద్ధమతమును ప్రచారము జేసిన బౌద్ధసన్యాసుల కొరకై చైత్యమును గట్టించిరి. ఇక్ష్వాకుల తదనంతరము కృష్ణసీమను సాలంకాయనులు పరిపాలించిరి. వీరు శైవారాధకులు; వీరి రాజధాని నదీ వుత్తరతీరమున వేంగి, వీరి సమకాలికులైన పల్లవులు కృష్ణా దక్షిణతీరమున మూడు శతాబ్దములు పాలించిరి; గుంటూరు మండల వుత్తర భాగమున ఆనంద గోత్రరాజులు పరిపాలన నెరపుచుండిరి.

క్రీ. శ. 5వ శతాబ్దము మధ్యనుండి 7వ శ॥ మొదటి పాదము వరకు బాలించిన విష్ణుకుండినులలో విక్రమహేంద్రవర్మ నదికి దక్షిణమున ఆనందగోత్రులను, సాలంకాయనులను జయించి, నదిని దాటి రాజ్యమును విస్తృతపర్చెను; కృష్ణా వుభయతటములను జయించెను. మాధవవర్మ I గోదావరిని సైతము దాటిపోయి పిష్టపురపు రామకశ్యపరాజుల జయించెను. విష్ణుకుండినుల యాధ్వర్యమున కృష్ణా వుత్తరతీరమున విజయవాడలో రెండు గుహాలు, మొగల్రాజపురమున 5 గుహాలు, నది కవ్వాలి తీరమున రెండు మైళ్ళ దూరమున వుండవిల్లిలో 5 గుహాలు శిల్పసమన్వితమై బ్రాహ్మణమత ప్రాబిర్భావమును జాటుచున్నవి. రామాయణము, మహాభారతము, పురాణములందలి కథలు యీ గుహాలలో రూపింపబడినవి.

కళింగదేశపు మాఠరవంశపు ప్రభంజనవర్మ కృష్ణావేణ్యా మహానద్యాంతరస్థ ప్రజాధర్మానుశాసన బిరుదు వహించెను. పల్నాడును పాలించిన హైహాయరాజు అనుగురాజు (క్రీ. శ. 1134-1147) వుత్తరదేశమున జంభనాపురినుండి కార్తవీర్యుని శాపమునుండి విముక్తిబొందుటకై సపరివారముగ బయలుదేరి ఆంధ్రభూస్థలి జొచ్చి అమరావతిచెంత కృష్ణలో గ్రుంకులిడి శాపవిమోచనుడై పల్నాడులో హైహాయ రాజ్యమును స్థాపించెనను వాడుక గలదు. పల్నాటి భారతమని పేర్గాంచిన పల్నాటి వీరగాథ నెరుగని యాంధ్రులుండరు. శ్రీనాథ కవిసార్వభౌముడు పల్నాటి ప్రాభవమును, తన వీరచరిత్రయందును, క్రీడాభిరామమందును, యెన్నో చాటువులందును విరచించియున్నాడు. కొండపడమటి రాజ్యమునకు కృష్ణాస్రవంతి తూర్పు

జిల్లయై యుండెను. కోటరాజ్యమునకు రాజధాని అమరావతి; కోట ప్రభువులు అమరేశ్వర దివ్యశ్రీపాద పద్మారాధకులు. కోట భూమి యంతయు కృష్ణాపరిసరములే. ఆంధ్రదేశమునంతను బరిపాలించిన వెల్నాడు రాజుల రాజధాని చందవోలు. వీరు ముక్కంటి కాడువెట్టి ప్రసాదాసాదిత కృష్ణవేణ్యా దక్షిణషట్సహస్రావనీనాథులు. వీరి రాజ్యమునకును, ఆంధ్ర భూతలమునకును నడిగడ్డ వెల్నాడు దేశము కృష్ణాతీరస్థమే, రెడ్డిరాజ్యమున ప్రసిద్ధమైన కొండపల్లి, కొండవీడు దుర్గములు కృష్ణాసీమలోనివే. రెడ్డిరాజులు కృష్ణావుభతీరముల యనేక దానములు జేసి. శాసనములు వ్రాయించిరి; శ్రీశైలమున పాతాళగంగకు మెట్లు గట్టించిరి; మల్లికార్జునుని యాలయములో వీరశిరోమంటపము గట్టించిరి. క్రీ. శ. 1400 ప్రాంతమున ధరణికోటను బాలించిన దంతులూరి గన్నభూపాలుడు కృషవేణ్ణాజల క్రీడావినోద బిరుదువహించెను. విజయనగర చక్రవర్తులకును, గజపతులకును కృష్ణాప్రాంతముల స్వాధీనపర్చుకొనుటకై తరచుగ యుద్ధములు జరుగుచుండెను. బహామనీ సుల్తానులు రాయచూరుకోనను, కృష్ణాతీరములకై విజయనగర ప్రభువులతోను బోరుచుండిరి. రాయల, ముస్లిముల, గజపతుల గూర్చియే "ముగురురాజులకును మోహంబుబుట్టించు గురుతైన యుర్విత్రాడు కొండవీడు" అన్నాడు శ్రీనాథకవి. క్రీ. శ 1450-51 ప్రాంతములో కపిలేశ్వర గజపతి గోదావరిని దాటి రాజమహేంద్రవరమును, కృష్ణను దాటి కొండవీడును బట్టుకొనెను క్రీ. శ 1467 దక్షిణ దిగ్విజయము కొరకై కృష్ణవరకు వచ్చెను. కృషరాయలు దిగ్విజయయాత్రకీమార్గమున నేజనెను. ఔరంగజేబు మహారాష్ట్రులతో బోరుచు కృష్ణాతీరమున విడిసెను.

బ్రిటిషు పాలనయందును, స్వతంత్ర భారతమందును కృష్ణా, గుంటూరు మండలములు వివిధరంగములందును వుత్కృష్టస్థానమును గడించినవి; యింకను విరాజిల్ల గలవు.

పుట్టుకస్థానమును బట్టి కృష్ణ శాసనములలో సహ్యాజయనియు, సహ్యాపుత్రి యనియు బిల్వబడియున్నది. పురాణములందు కృష్ణవేణిక, వేణికా యను నామములు గలవు. కృష్ణనది వెణ్ణా, వేణీ నదుల జేర్చుకొనిన స్థానమునుండి కృష్ణవెణ్ణా, కన్వబెణ్ణా, కృష్ణబెణ్ణా, కృష్ణసెణా, కృష్ణవేణి, కృష్ణవెర్ణ, కృష్ణవర్ణ యను వేర్వేరు నామముల బొందుచున్నది. కొన్ని సందర్భముల పేరంతకు బదులు వెణ్ణా, వేణి యనబడియున్నది. కృష్ణలో సంగమించు వేణీనది ప్రశంస పద్మపురాణము వుత్తరభాగములో నున్నది. కృష్ణవేణీ మహాత్మ్యమును పద్మపురాణమందే స్వర్గఖండమున జెప్పబడినది. ఖారవేలుని హాథిగుంఫ శాసనములో కృష్ణ, కన్నబెన్న యనబడినది.

కృష్ణ జన్మస్థానమైన మహాబలేశ్వరము కడ శివాలయము యాత్రాస్థలము. దీనిం గూర్చిన ప్రశంస రామాయణములో కిష్కింధాకాండమందును, నగ్ని పురాణమందును గలదు. కృష్ణలో సంగమించు భీమనది భీమరథి, భీమరథాయనియు శాసనములలో గలదు. ఇది సైనానదితో కలిసి సంయుక్తసదమై బొంబై ప్రాంతముల ప్రవహించుచున్నది. భీమానదీ ప్రశంస గరుడ పురాణమందును, మార్కండేయ పురాణమందును గలదు. సహ్యాద్రులలో దీని జన్మస్థానమైన భీమశంకర దేవాలయమున్నది ఢాకినీ క్షేత్రము. కృష్ణకు మరొక వుపనదియైన గుట్టర్గా నదీతీరమున భీజపురు మండల ప్రధానస్థానము భాగల్కోటపురము గలదు. వుపనది మాలప్రభాతీరమున పశ్చిమ చాళుక్యుల రాజధానియైన వాతాపినగరము, ప్రస్తుతపు బాదామి గలదు. ఇది పూర్వము వాతాపి యను రాక్షసుని స్థానమట. దీనికి సమీపమందే యిల్వలునిని స్థానము యిల్వలము, యిప్పటి ఐహోలు

పట్నము గలదు. వటపి, యిల్వాలములు చాళుక్య శిల్పమునకు నిధానములు దక్షిణ వారాణసి యనబడు పట్టదకల్లు మాలప్రభాతీరమే.

కృష్ణతో గలియు మున్నేరు, మునియేరు, మున్ననది యనబడుచున్నది. కొంతభూమిని ఫలవంతమునుజేసి కంబంమెట్టు పురము ప్రక్కగ బ్రవహించుచున్నది. ఆ ప్రాంతవాసులు దీనిని జీవనది యందురు. దీని ప్రశంస ఆంధ్ర వరాహ పురాణములో గలదు.

గోల్కొండ గనులని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వజ్రపుగనులు కృష్ణాతీరమున గలవు. కోహినూరు వజ్రము కృష్ణాతీరమున కొల్లూరులో దొరికినది. దీనిని ధర్మరాజు కిరీటమున ధరించెనట. క్రీ. శ. 1656 సం॥లో మీర్ జుమ్లా కోహినూరును షాజహాను చక్రవర్తికి బహూకరించెను. దీని బరువు ప్రథమమున 756 కారట్లు; ప్రస్తుతము 106¼ కారట్లు మాత్రమే బరువు గల్గి యున్నది.

విజయవాడవద్ద కృష్ణ ప్రవాహము రమణీయము; ఇచట బహుచక్కని రైల్వేవంతెన నిర్మింపబడినది. ఇంద్రకీలాద్రి పర్వతముపై కనకదుర్గ సుప్రసిద్ధమైన క్షేత్రము. ఇచట పూర్వము అర్జునుడు తపము చేసెనట. తూర్పుతీరమునందలి 3 ముఖ్యమైన రైలుదారులకు కూడలి బెజవాడ. ఇంతియేకాక వ్యాపారమునకును కేంద్రమై యున్నది. నూజివీడు, వల్లూరు, చల్లపల్లి, ముక్త్యాల కృష్ణామండలములో పూర్వపు జమిందారీ స్థానములు. జగ్గయ్యపేట వర్తకమునకు ప్రసిద్ధికెక్కియుండెను. కొండపల్లిలో క్రింది గ్రామం బొమ్మలకు ప్రసిద్ధమైయున్నది. కొండపైన దుర్గము చరిత్రలో విఖ్యాతిగాంచినది. కొండపల్లి కొండ కృష్ణానదినుండి వుత్తరమున గొంటూరు, జుజ్జూరు వరకును వ్యాపించి యున్నది; చుట్టుకొలత 100 మైళ్లు. దుర్గము నదినుండి 5 మైళ్ళ దూరమున నున్నది. దుర్గపు 4 గొప్ప బురుజులు దుర్గమునకు రక్షణస్థానములును, పరిశీలనస్థానములునై యుండెను. ఇవి 1) ఒంటిమన్యపు బురుజు 2) యెఱ్ఱబురుజు 3) యెడ్లకొండ బురుజు 4) హనుమంతుకొండ బురుజులై యున్నవి. హనుమంతుకొండ బురుజు ప్రధాన దుర్గమునకు తూర్పుగా రాజభవనమునకు మైలు దూరమున నున్నది. దీనిపైనుండి హైదరాబాదునకు బోవు బాటలు, కృష్ణానది కడుదూరమును యగపడును.

కృష్ణ కర్ణామృతమును రచించిన బిల్వమంగళ కవి కృష్ణా పడమటితీరమువాడు. 17వ శ॥న నుండి పదకర్తగ చిరకీర్తిగాంచిన క్షేత్రయ్యాది కృష్ణామండలములో కూచిపూడి సమీపమందలి మొవ్వ యనబడు మువ్వ గ్రామము. ఇచట క్షేత్రయ్య యారాధించిన వేణుగోపాలస్వామి యాలయము గలదు. కూచిపూడి నాట్యము జగత్ప్రసిద్ధముగదా! శ్రీకాకుళ ఆంధ్ర దేవుని బూజించి, పిమ్మట ఆముక్తమాల్యద రచించెను శ్రీకృష్ణ దేవరాయలు.

పావనకృష్ణవేణి, యీ తీరున వైవిధ్య విశిష్ట బొందియున్నది; పంద్రెండు వర్షముల కొకమారు వచ్చు కృష్ణాపుష్కరము కన్నుల బండువుగ నుండును.

★



అంతిమ విజయం

మళ్ళీ ఆకాశంలో
మేఘాలు క్రమ్ముకొంటున్నాయ్.
గంభీర సాగర గర్భంలో
బడబాగ్ని కీలలు రగులుతున్నాయ్.
సింహం గుహముందు
శౌర్యంలో మాకు సాటి ఎవరంటూ?
కీచు రాళ్ళు రొదచేస్తున్నాయి.
ఒడ్డున దూరంగా
ఒకరి జోలికి పోకుండా
ఒంటరిగా ఉన్న శిలని_
తమ పాదాలకు దాసుని చేసుకోవాలని
తహ తహలాడు తున్నయ్—
అప్పుడే ముందుకు సాగటం
అలవాటు చేసుకొంటున్న అలలు.

★ ★

శాంతించిన హిమన్నగం
అంత రంగంలో
క్రాంతికీల రగులుకొంది!
'మంచిమనిషి' హృదయంలో
మూలన అణగి ఉన్న పౌరుషాన్ని
జ్వాలామణి పర్వతంలా
బ్రద్దలయి పైకెగసింది.
సాధు కేగి పొలతలాన
కాలు దువ్వి నిలుచుంది-
నిదురించిన సింహం మేల్కొని
శివతాండం చేస్తున్నది-
మూర్తీభవించిన ధర్మం-
భీకర కరాళ దంష్ట్రిలతో
అన్యాయాన్ని కబళించటానికి
దౌర్జన్యాన్ని రూపు మాపటానికి
దుండగాలని తుదముట్టించటానికి
అడ్డు లేని వేగంతో
సాటిలేని శౌర్యంతో
నడుము కట్టి ముందడుగువేసింది
ఈ యుద్ధం రెండు దేశాల మధ్యకాదు.

★ ★

రెండు మహాశక్తులు మధ్య.
ఒక వైపున మూర్తీభవించిన
ధర్మం. న్యాయం
మరొక వైపున దానవత్వంలో
వెర్రి తలలు వేసి - మంచి తనాన్ని
జుర్రుకొందామని అర్రులు చాచే దౌర్జన్యం -
దుండగం—
మరి యీ రెండిటిలో దేనికి విజయం?
రాముని శక్తితో పవిత్ర ఆశయానికి
కంకణం కట్టినిలచిన ధర్మమూర్తులకా?
రావణునిలా
మదించిన అహంకారంతో
కన్ను మిన్నూ గానక
మిడిసి పడే దానవునికా?

★ ★

ఏనాడూ ధర్మమే జయిస్తుంది.
ఎల్లకాలం సత్యమే ఫలిస్తుంది.
మనమంతా కన్నతల్లి స్వాతంత్ర్యం
కాపాడటానికి నడుం కట్టినప్పుడు-
భారత మాత నవ్వు ముఖంతో
మన నుదుట వీరతిలకం దిద్దినపుడు-
రణరంగంలో భారత వీరులు
ప్రాణాలకు తెగించి వీర రసంకుప్పించినప్పుడు
తప్పక మననే విజయలక్ష్మి వరిస్తుంది
అంతిమ విజయం మనకే లభిస్తుంది.
భరత మాత యశోదధితి
స్వర్గధామంలో ప్రతిబింబిస్తుంది—

శ్రీ సత్యం



ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి

మూడవ పంచవర్ష ప్రణాళికలో అమలు జరుగుతున్న పథకాలలో నూటికి 80 వంతులకు పైగా దేశరక్షణకు సంబంధించినవే; తక్కిన పథకాలుకూడా పరోక్షముగా దేశరక్షణకు తోడ్పడుతున్న వే.

పారిశ్రామికాభివృద్ధికి, దాని ద్వారా దేశరక్షణ శక్తిని మరింత పటిష్ఠవంతము చేయడానికి ప్రణాళిక ప్రగతి మరింత వేగవంతము చేయబడినది.

ఉక్కు, యంత్ర పరికరములు, ఖనిజములు, ముడి సరుకుల ఉత్పత్తి ఎక్కువ చేయబడింది. ఇంజనీరింగు, దానికి సంబంధించిన పరిశ్రమల శక్తి పూర్తిగా వినియోగింపబడుతుంది.

దేశరక్షణకు ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి ముఖ్యాధారము. మరింత వేగముగాను, సమర్థతతోను ప్రణాళికను అమలుపరచినట్లైతే మన రక్షణ శక్తి పెరిగి దేశము పటిష్ఠవంతమౌతుంది.



దేశరక్షణకు

శారదలేఖలు

సౌభాగ్యవతి కల్పతకు

నెచ్చెలీ!

నేడునాగరికత పెచ్చుమీరినదనియు, విద్యగూడ అధికమైనదనియు, మనము మునుపటికంటె యెక్కుపరిణితి చెందినామనియు అనుకొనుచున్నాము. కాని యిది మన భ్రాంతితప్పసత్యముగాదు. మనలో మూఢాచారములుగాని, మూఢనమ్మికలుగాని కొంచెమైనను నశించలేదు.

చూచితివా, ఒకరియింట చెదలుపుట్టలు పెట్టెనట. అందులో ఒకపుట్ట నాగేంద్రునిపడగవలె నున్నదట, ఇకనేము అచట సుబ్రహ్మణ్య స్వామివెలసినాడని ఒక మాట పుట్టించినారు. మాటపుట్టినదే తరువాయివేలాది ప్రజలు ఆస్వామిని చూచుటకు బయలుదేరినారు. నిముషములో దానినొకపుణ్యక్షేత్రము చేసినారు. కొబ్బరికాయలు కర్పూరము వడపప్పు పానకములు కోకొల్లలైనవి. పిల్లలకు తలనీలాలివ్వడము, చెవులకు పోగులు కుట్టించడము. మొదలైన మ్రొక్కులు చెల్లించడముగూడ నారంభమైనది. కానియింతవరకు ఆ నాగేంద్రుని ఇలలో కాదుగదా కలలోనైనను కాంచినవారులేరు. ఆ స్వామి చూపిన మహత్తులుగాని నివారించిన ఆపదలుగాని కనిపించవు. కొంతకాల మీ ప్రభయిట్లువెలిగినది. మరి యిప్పుడా విషయము చెప్పుకొను వారుగాని అచటకు పోవువారుగాని కనిపించుటలేదు. ఆసత్యముగల దేవుడేమైనాడో ప్రజలక్కడకు పోవుట ఏలమానినారో తెలియదు.

ఆ మధ్యగుంటూరుకు సమీపమున చెడిపోయిన బావినొకదానిని కొంతమందిభక్తులు కనిపెట్టిరి. ఆబావిలోని నీరు పాచిపట్టి వాసనకొట్టుచుండెను. ఆ బావిలోని నీరు సకల రోగనివారకములనియు, సకలవాంఛాఫల ప్రదాయకములనియు ఒకవాదు పుట్టించిరి. ప్రజలిక ఆ నీళ్లకు ఎగబడ సాగిరి. ఆనూతిలోని నీళ్లను తోడి అచట సేవించుటయేగాదు బిందెలకును. చెంబులకును పట్టించి సీలు చేయించి కాశీగంగవలె వూళ్లకుగూడా పంపసాగిరి. మరి ఆతీర్థమువలన ఎవరికి రోగములు నయమైనవో ఎవరికి ఇష్టార్థములు తీరినవోతెలియదు. ఇప్పుడా బావినీటిని తలచినవారు కనిపించుటలేదు.

ఒకానొకవూర ఒకతాడిచెట్టు కొమ్మలువేసినదట! తాడిచెట్టుకు కొమ్మలుండవుగదా, ఇకనేమి అది దేవుడై కూర్చున్నది. ఆ తాడిచెట్టు పగలు నిటారుగా నిలిచి యుండుననియు రాత్రులు వంగుననియు కాదు పడుకొనుననియు చెప్పిరి. ఇకనేమి కావలయును, ఆ మహత్తును చూచుటకు ఆ తాడిచెట్టు దేవుని దర్శించుటకు ప్రజలు తండోప తండములుగా వెడలసాగిరి ఆ తాడిచెట్టు ఎట్లా ఉన్నది? నిలబడియే యున్నది. అది యెప్పుడు పడుకొనినది? ఏమో మాకు తెలియదు. పడుకొనిన దెవరైనను చూచినారా? మేము చూడలేదు. ఫలానివారు చెప్పగా మేము విన్నాము. అందఱు అట్లు చెప్పగా విన్నవారే. ఇక చూచినవారెవరు? కొన్నాళ్ళకీ విశేషము అంతరించినది.

ఈ మధ్య మా వూరికొక రజక స్త్రీ వచ్చినది. ఆమె నోటినుండి లింగములు వచ్చుచుండునట. ఎవరిపై అనుగ్రహము కలిగినదో వారికామె ఆ లింగము లిచ్చునట. ఆ లింగమునుపెట్టి పూజించుకొన్నవారికి సమస్తకోరికలీడేరునట, సమస్తవ్యాధులు నివారణ యగునట. కాని ఆమె అనుగ్రహమునకు పాత్రులైనవారుగూడ ఇప్పటికిని అటులనే ఉన్నారు. ఆమె యేమైనదో ఆమె మహత్తులేమైనవో ఇప్పుడెవ్వరును ఆ విషయము చెప్పుకొనుట లేదు.

ఇటివల వేంకటేశ్వర స్వామి భక్తుడు అకస్మాత్తుగా పైకి వచ్చెను. ఇంటింటను, పూజలు, భజనలు, సప్తాహములు ఏకాహములు భారీయెత్తుననే సాగెను. సంతర్పణలు గూడకోలాహలముగ జరిగినవి. ఇకనేమి ఏడుకొండలస్వామి కొండదిగి మనయూరు వేంచేసినాడనియు ప్రజలు చెప్పుకోన సాగిరి, పూజలు కానుకలు మ్రొక్కులు, ఇచటనే చెల్లించ వచ్చునిరి. కొందరు తలలు బోడిచెయించు కొనిరి కాని ఆ వేంకటేశ్వర స్వామి మహిమ అచట తరగనులేదు ఇచటపెరగనులేదు. అంత యుమామూలై పోయినది.

మొన్న మొన్ననే ఆంజనేయస్వామి వారి ఆలయమున కొక భక్తురాలు వేంచేసినదట ఆమె ముక్కాలి పీటమీద దేవుని పలికించు చున్నదట. ఆ మెచేయిపెట్టి ఉన్నచాలును, ఆపీట ఎచటికి పొమ్మనిన అచటికి పోవునట. మూడునాలు దినములు ఆంజనేయుని ఆలయము జనులతో క్రిక్కిరిసి పోయినది ముక్కాలు పీటగాదు. స్టూమీదకుగూడ వేంకటేశ్వరుడు ఆవహించి నాడనిరి ఇపుడావిషయము చెప్పుకొను వారులేరు.

ఆమధ్య హరనాథ బాబాను గురించి భక్తులుకొందరు కోలాహలముగా చెప్పుకొనుచుండెడి వారు. వార వారము పూజలు, భజనలు, తీయని మిఠాయిల నివేదనలు జోరుగ సాగుచుండెడివి హరనాథ బాబాశిష్య బృందము, ఆయనభార్య వగైరాలు స్వయముగా విజయవాడ విచ్చేసి కోలాహలము చేసిపోయిన తరువాత ఎందువల్లనో అది వృద్ధిపొందుటపోయి సన్నగిలినది. ఇపుడు హరనాథబాబా వెనుకబడినాడు. సాయిబాబా పైకివచ్చినాడు ఈయనకొంచెమునిలువ త్రొక్కుకొనినాడు, గొప్పవారి దేవుడై మంచి మంచి ఆలయములు కట్టించు కొనినాడు. ఈయన విభూతికి తీర్థములకు ఇపుడు విలువబాగుగనే యున్నది. ఈ మధ్య సాయిబాబావారి శిష్యులొకరు మావూరు విచ్చేసిరి. ఆయనచేతితో ముట్టిన చాలును. సమస్త రోగములునివారణఅగునట, సమస్తమన క్లేశములు తీరునట. తమ మూగఅబ్బాయికి మాటలువొచ్చి భారత భాగవతములు చదువ గలడనిన, తమకుంటి అమ్మాయి కుంటితనము పోయి, డ్యాన్సుచేయగలదనిన, తమవంధ్యత్వముపోయి, సంతానము కలుగుననిన ఎవరికి ఆశకలుగదు. ఎవరికి సంతోషము పుట్టదు. చేతికందనున్న ఫలమును ఎవరు జారవిడుచుకొందురు! ప్రజలు ఆయనను చుట్టుముట్టిరి తొమ్మిది దినములు. సాయిబాబావారి పూజలు భజనలు కోలాహలముగ జరిగినవి. ప్రజలు సాయిబాబా భక్తునకు సాగిలబడి మ్రొక్కిరి. ఆయన పాదములను కన్నుల కద్దుకొనిరి. ఆయన పాదరజమును శిరసున దాల్చిరి. సాయిబాబావారికి హారతి యిచ్చుటకై కర్పూరము వెలిగించగా ఆ పళ్ళెములో పాదమువలె హద్దు యేర్పడినదట ఇకనేమి అది బాబావారి పాదుకయే అనిరి. ఆ సాయిభక్తుడు కొందరికిచ్చిన అరటిపండులో సాయి నామమున్నట్టును, కొందరికి సాయివిగ్రహములే ప్రసాదింపబడినట్టును చెప్పుకొనిరి. ఆ మహాత్తులు మాటలలో తప్ప క్రియలలో పనిచేయవేమో. ఆ కోలాహల మణగినది. ఎప్పటివారు ఎప్పటివలెనే ఉన్నారు. ఒకరి వ్యాధియు నిమ్మళించలేదు. ఒకరి కోరికయు ఈడేరలేదు. ఈ ఆడియాసలతో పరుగులెత్తుట పామరజన వ్యవహారమేమో అనుకొనిన అట్లుగాదు. ఇట్లా పోయిన వారిలో పండితులు ఉన్నారు. ఉద్యోగులు ఉన్నారు. భూస్వాములు ఉన్నారు. పేదలు ఉన్నారు. ధనవంతులు ఉన్నారు. స్త్రీలు ఉన్నారు పురుషులు ఉన్నారు. బాలలు ఉన్నారు. వృద్ధులు ఉన్నారు. ఈ భగవంతుని వ్యవహారము నడపువారిలో కొందఱు భక్తులు. కొందఱు జ్ఞానులు. కొందఱు సాక్షాత్తు దేవుళ్లే! వీరందరు ఆశ్రిత కోటి అభీష్టములు తీర్చువారే. ఈ కొల్చెడివారి కోరికలు అనేకవిధములుగా ఉన్నవి. మొదటిది వ్యాధి నివారణ, రెండవది సంతానప్రాప్తి, మూడవది సిరిసంపదలు. ఇంకను అమ్మాయి పెండ్లి, అబ్బాయి పరీక్ష, తన ప్రమోషను తన అధికారి అనుగ్రహము ఇట్లుఅనేకములు ఇవన్నియు మానవయత్నము లేకుండనే, ఏమాత్రము శ్రమపడకుండనే. ఒక్క కొబ్బరికాయ కర్పూరము, దక్షిణ తాంబూలాదులతో నివారణకావలెనని వారి ఆశ, నివారణయగునని వారినమ్మకము. కాని "అవశ్యమను భోక్తవ్యం కృతంకర్మ శుభాశుభమ్." అను సిద్ధాంతము. మనమెఱుగనిదికాదు. దైవనిర్ణయము వలన మంచిచెడ్డలు అనుభవించక తప్పదు, అన్నియు మంచివియే కావలెననుటయు. వానికొరకే విధముగా మహత్తులుగలవారిని కొలుచుట వలన పొందగలమనుకొనుటయు వెఱ్ఱితప్ప వేరుగాదు. కాని అనాదిగా ఈ నమ్మకములు మనదేశము స్త్రీ పురుషులలోగూడ పాదుకొనిపోయినవి. అందువలన అట్టి మహత్తులెక్కడ కలవనిన అచటికి పరుగులెత్తుకొనిపోవుట మనవారికి పరిపాటైపోయినది. ప్రజలకు గల ఈ నమ్మకమును ఆధారముచేసికొని లేనిమహత్తులు కల్పించుకొని జనులను మోసగించు కపట సన్యాసులు, గురువులు, స్వాములు, దేవాంశసంభూతులును ఎక్కువైనారు. అందువల్లనే

కాశీ దేశాన్నుంచి కావిగుడ్డలు కట్టి
బవిరిగడ్డపు బాబాలొచ్చేరయో,

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

బాబాకు మ్రొక్కితే పాపలెత్తేమంచు
వెట్టి ఆడంగులు నమ్మేరయా

సత్యమురా గురుడ సత్యమురా
గురుబాలవాక్యంబు సత్యమురా

దొంగమాటలు చెప్పి
కొంగజపములుచేయు
గురుస్వాము లూరూర వెలిశారయా
భక్తబృందముగూర్చి భజనలుచేయుచు

బంగారుపాదుకల నడిచేరయా ॥సత్యమురా॥

అని ప్రజలను హెచ్చరించవలసి వచ్చినది.

కల్పలతా!

ఈ భజనలచాటున, ఈ భక్తబృందముల చాటున ఈ భగవదంశా సంఘాతులచాటున జరుగు అత్యాచారములకు అంతులేదు ఇవి అనేకచోటులలో ఎట్లు హాస్యాస్పదము లగుచున్నదియు తెలిసియు, వీనిని మనవారు నమ్ము చుండుట మాత్రము ఆశ్చర్యము కొలుపకపోదు. కరుడు కట్టిన ఈ మూఢనమ్మికలు అంధవిశ్వాసములు మన దేశమున నెట్లు అంతరించునో తెలియదు. ఈ నమ్మిక లలో స్త్రీల పాలెక్కువ. విద్యానాగరికతలు మనదేశమున విస్తరించుచున్నను ఈ నమ్మకములు మాత్రము మనలో వీసమైనను తరుగలేదు.

ఈ మహాత్తుల విషయములో, కులవిచక్షతలేదు. తమ బాధలు పోవునని, తమకేదియేని లాభముచేకూరునని, మహమ్మదీయుల పేర్లను, ఏసుక్రీస్తు శిలువను గూడ కొలిచెదరు. హరిజనతీర్థమునైనను సేవించెదరు. కృష్ణాజిల్లాలో మొన్న మొన్నటి వఱకు ఒక యోగిని యుండెడిది. ఆమె మాలకులమునకు చెందినది, అయిన నేమి బ్రాహ్మణులు ప్రభృతి అన్నికులముల వారును ఆమెను సేవించెడివారు. ఆమె ప్రసాదమును ఆరగించెడి వారు. ఆమె ఎంతవారినైనను ఎమిరా! ఏమే అనెడిదట ఆమెవల్ల వీరుపొందిన జ్ఞానసంపత్తి అగమ్యము. కాని అందరు ఆమె ఉచ్ఛిష్టము తిని. ఆమెచేతి తీర్థమును సేవించెడి వారని చెప్పగా వింటిని.

ఈ మహాత్తులకు జనులు ఒకరినుండి ఒకరుచెప్పు కొనుటతప్ప ప్రత్యక్షనిదర్శనము లుండవు. అయినను మనవారికి వారివల్ల కావలసినది మోక్ష సాధనముగాదు, తమ జబ్బులు పోవుటయు. తమ కేవేవో లాభములు చేకూరుటయు మాత్రమే వారికి కావలసినది. అందులకే వారు, వారు కట్టివిడిచిన గుడ్డను కట్టుటకును, వారు తిని విడిచిన తిండిని తినుటకును, వారు త్రాగివిడిచిన నీరును త్రాగుటకును, వారు స్నానమాడిన జలమును సేవించు టకును పాల్పడు చున్నారు ఇందులో దైవచింతనగాని ఆత్మసాధనగాని లేశమును లేదు.

సోదరీ! దైవము లేదనను, దైవపూజ కాదనను, మహాత్ములుండరనను. అట్టివారిసేవ ఇహపరార్థసాధన మనుటలోను సందేహములేదు. కాని మానవులమై పుట్టిన తరువాత విచక్షణలేకుండా ఇంత మూఢనమ్మకాలతో మనం ఇప్పటికీ మునిగి ఉండటమే నాకు ఆశ్చర్యమును విచారమును కలిగించు చున్నది.

భక్తుడు జ్ఞానికావలయును, జ్ఞాని భక్తుడుకావలయును. ఉభయులును వైరాగ్యసంపన్నులు కావలయును. అందరి జీవితములకును నీతి కొలికిపూస కావలయును. మన ఐహికాముష్మిక క్రియాకలాపములన్నియు ఆ నీతిసూత్ర మునకు నిబద్ధములై యుండవలయును నిష్కాములమై మనము వారిని కొలువవలయును. నిర్మములై వారు మనలను అనుగ్రహింప వలయును. అట్టి మహాత్ము లొక్కరే లోకమునకు పూజ్యులు! మార్గదర్శకులు!!

మిత్రురాలు శారద.

చెకొస్లొవాకియాలో :

స్త్రీల వృత్తి నైపుణ్యం

వృత్తి, వుద్యోగాలలో ప్రవేశిస్తున్న స్త్రీలసంఖ్య ఏటేటా చెకొస్లొవేకియాలో ఎక్కువవుతూంది. 1957 లో వ్యవసాయ సహకార సంఘాలలో పనిచేసే స్త్రీలను మినహాయించగా సామ్యవాద ఆర్థికరంగంలో పనిచేస్తూ వుండిన మొత్తం వుద్యోగులలో 37 శాతం స్త్రీ లుండే వారు. 1958 లో మరొక 63000 మందీ, 1959 లో మరొక 93000 మందీ, 1960 లో యింకా 133,000 మందీ స్త్రీలు ఉద్యోగాలలో ప్రవేశించారు. ఈ సంవత్సరం 80,000 మంది కార్మిక రంగంలో ప్రవేశిస్తారు.

ఆవిధంగా ఇటీవల సంవత్సరాలలో స్త్రీలు జాతీయార్థిక నిర్మాణంలో అధికతర పాత్రను నిర్వహిస్తున్నారు. ఈనాడు మొత్తం కార్మికుల సంఖ్యలో స్త్రీలు 43.5 శాతమున్నారు.

పనిచేస్తున్న స్త్రీల సంఖ్య విషయంలో యీ నాడు చెకొస్లొవేకియా ప్రపంచంలో మూడవస్థానంలో వుంది. స్త్రీలకుబాగా అనువైన శాఖలలోనే వారు ఎక్కువగా ఆరోగ్యరంగంలో (73.5 శాతం)నూ, విద్యా సాంస్కృతిక రంగాలలో నూ (60 2 శాతం), చిల్లరవ్యాపారం, హోటళ్ళలోనూ (68 శాతం) వున్నారు. యుద్ధానంతరం కొన్ని శాఖలలో స్త్రీలు పనిచేయడానికి అవసరమైన పరిస్థితులు కల్పించబడ్డాయి. వీటిలోకూడా స్త్రీల సంఖ్య ఎక్కువవుతూంది. ఉదాహరణకు 1948 లో పరిశ్రమలలో పనిచేస్తూ వుండినవారిలో నూటికి 27 గురు మాత్రమే స్త్రీ లుండేవారు. 1960 నాటికి యీ సంఖ్య అన్ని పరిశ్రమలలోనూ 37 శాతానికి పెరిగింది. వినియోగవస్తువులూ, ఆహారపదార్థాలు, ఉత్పత్తిచేసే పరిశ్రమలలోనేకాక (యిదివరకుకూడా వీటిలో స్త్రీలు పనిచేసేవారు) ఇంజినీరింగు, రసాయినిక పరిశ్రమలవంటి యితర పరిశ్రమలలోకూడా స్త్రీ లిప్పుడు పనిచేస్తున్నారు.

పనిచేసే స్త్రీలసంఖ్య యింకా పెరుగుతుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 1961 కీ 1965 కీ మధ్య కార్మిక రంగంలో కొత్తగా 260,000 మందికిపైగా స్త్రీలు ప్రవేశిస్తారు ముఖ్యంగా పరిశ్రమలు, ఇంజనీరింగు, రసాయినిక కర్మాగారాలు, వాణిజ్యం, హోటేళ్ళు, రవాణా, కమ్యూనికేషన్లు, విద్య,ఆరోగ్య,సాంస్కృతిక, సాంఘిక సేవారంగాలలో స్త్రీలకు తగినపనులు కల్పించడం జరుగుతుంది. ఇప్పటికంటె ఎక్కువగా అంగబలానికి గిరాకీ ఏర్పడుతూంది కాబట్టి స్త్రీలకు అపారమైన అవకాశాలున్నాయి. బొహిమియా, మొరామియాలలో ఇప్పుడు దాదాపు 40,000 మంది వుద్యోగుల అవసరముంది.

జాతీయార్థికాభివృద్ధికి స్త్రీలు ఎక్కువగా పనులు చెయ్యడం అవసర మవుతుంది. అయితే పరిస్థితియింకా సంతృప్తి కరంగాలేదు. స్త్రీలు చేస్తున్న పనులను చూసినట్లయితే ఎక్కువమంది తక్కువ బాధ్యతగల పనుల్లోనే వున్నారు. ఆరోగ్య రంగంలో పనిచేస్తున్న మొత్తం ఉద్యోగులలో స్త్రీలు 73 శాతమున్నప్పటికి లేడీడాక్టర్లు మాత్రం 6500 మందే వున్నారు. మగడాక్టర్ల సంఖ్య దీనికి మూడురెట్లు ఎక్కువ. విద్యారంగంలో కూడా బాధ్యతాయుతమైన పనుల్లోవున్న స్త్రీల సంఖ్య తక్కువే. దేశంలో 35 మంది స్త్రీలు మాత్రమే విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లుగా వున్నారు. యూనివర్సిటీరీడర్ల సంఖ్య మరీ తక్కువ. ఫ్యాక్టరీలలోకూడా ఉన్నత యోగ్యతలుగల స్త్రీల సంఖ్య తక్కువే.

దేశం మొత్తంమీద స్త్రీలు తక్కువ నైపుణ్యం అవసరమున్న పనులు చేస్తున్నందువల్ల, సమానమైన పనికి సమానమైన జీతమివ్వాలనే సూత్రం కచ్చితంగా పాటించబడుతున్నప్పటికీ, వారి ఆదాయాలు తక్కువగానే లభిస్తున్నాయని అంగీకరించాలి. దీనికి, యుద్ధానికి పూర్వపు పెట్టుబడుదారీ రాజ్యంనుండి సంక్రమించిన దురదృష్టకరమైన వారసత్వం కొంతవరకు కారణం. చాలావరకు స్త్రీలు యింకా మగవాళ్ళకంటె ఎక్కువగా, కుటుంబ విషయాలపట్ల, గృహ విషయాలపట్ల ఆసక్తి వహిస్తూ చేతినిండా పనికల్పించుకుంటున్నారు. వారికి వుద్యోగాలు చేయాలని వున్నప్పటికీ చాలామంది స్త్రీలకి పెద్ద కుటుంబాలుండడంవల్ల అలాచేయలేక పోతున్నారు. వుద్యోగాలలో వున్న స్త్రీలకు తమనైపుణ్యాన్ని, యోగ్యతలను వృద్ధిచేసుకోడానికి వ్యవధిలేకుండావుంది. ఇందుకు మగవాళ్ళు వారానికి 7 నుండి 10 గంటలు వెచ్చిస్తూ వుంటే స్త్రీలు 2 నుండి 4 గంటలు మాత్రమే వెచ్చిస్తున్నారు.

కాబట్టి స్త్రీలు తమ సామర్థ్యాన్నిబట్టి ఉద్యోగాన్ని ఎంచుకుని, తమ యోగ్యతలను నైపుణ్యాన్నీ పెంపొందించుకోడానికి తగిన పరిస్థితులన్నీ కల్పించడానికి ప్రయత్నించాలి. ★

తలనొప్పిగా. ఉందా?

రవ్వంత **అమృతాంజనము** రాయండి

నిమిషంలో
నొప్పి తగ్గుతుంది



జలుబూ, జ్వరాలూ, ఒళ్లు నొప్పులు – వీటన్నిటికీ అమృతాంజనం ఉపయోగించండి. మీ కుటుంబాని కది శ్రీరామరక్ష. నొప్పి కలిగినప్పుడు ఒక్క పిసరు రాస్తేచాలు ఇంట్లో ఒక్క సీసా ఉంటే నెలలతరబడి అటివస్తుంది.



అమృతాంజన్ లిమిటెడ్, మద్రాసు - 4
బొంబాయి - 1, కలకత్తా - 1, న్యూఢిల్లీ - 1.

IWT AM-1424

"ఆయనగారు వుద్యోగం వెతుక్కుందుకు బయల్దేరుతా నంటున్నారు. నువ్వేమో ఉద్యోగంలో చేరడానికి వెళ్తా నంటున్నావు. యిద్దరి వుద్దేశాలూ బాగానేవున్నాయి. యిహ నా వుద్దేశం వినండిద్దరూ – ఆగాడు – సుధ, ప్రకాశ్ యిద్దరూ ప్రశ్నార్థకంగా చూశారు ప్రభువేపు.

"నీ ఆరోగ్యం పూర్తిగా బాగుపడ్డాక సుధారాణిని నీకు పరిచయం చెయ్యకపోవడం నా పొరపాటు. యిందుకు ముందు నువ్వు నన్ను క్షమించాల్సివుంది ప్రకాశ్. యిక తర్వాత విషయం. సుధారాణి నా ప్రియమైన చెల్లెలు. ఆమెను నీ జీవిత సహచారిణిగా స్వీకరించమని కోరుతున్నాను. యీ కోరికను యిద్దరూ పాటించి అంగీకరిస్తారని ఆశిస్తున్నాను. యీ అన్ని విషయాలనూ, అంటే నీ వునికినీ, నీ ఆరోగ్యాన్నీ, నా నిర్ణయాన్నీ అన్నీ మీ నాన్నగారికి వుత్తరం ద్వారా తెలియజేశాను. మీ అంగీకారం తెలిస్తే ముహూర్తం పెట్టిస్తాను" అన్న ప్రభు మాటలు వినగానే సుధ సిగ్గుతో అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ప్రకాశ్ ప్రభు రెండు చేతులనూ పట్టుకుని వూపుతూ ఆర్ద్రమైన కళ్ళతో. "మీ రిద్దరూ అన్నాచెల్లెళ్ళని వూహించలేకపోయాను ప్రభూ! యిద్దరికీ జీవితాంతం కృతజ్ఞుడనై వుంటాను" అన్నాడు.

"యిక్కడ కృతజ్ఞతలు వగైరా పెద్దమాట లెందుకు ప్రకాశ్, చిన్ననాటి మన స్నేహం, ఈ మధ్యకాలంలో విడిపోయినా శాశ్వితంగా వుండేందుకు మనిద్దరి మధ్యా యీ బాంధవ్యం చాలా అవసరం" అన్నాడు ప్రభు చేతులు విడిపించుకుంటూ.

ప్రకాశ్ తండ్రి ప్రభు సహాయానికి కన్నీళ్ళతో కృతజ్ఞత తెల్పుకున్నాడు. బంధువుల సమక్షంలో ప్రభు అధ్వర్యంలో సుధా ప్రకాశ్‌ల వివాహం అతివైభవంగా జరిగిపోయింది.

వివాహం జరిగినరోజు ఏప్రెల్ 24.

ఒకానొక ఏప్రిల్ 24ననే తన జీవితంలో గాఢాంధకారం పులుముకుంది. యిప్పుడు అదేరోజున జీవితానికి ఆశాజ్యోతి వెలిగింది. యీనాటినుంచీ నూతన జీవితం ఆరంభం కాబోతోంది. యికనైనా మనస్తాపం అనేది ఎరుగని శాంతిజీవనాన్ని కోరుతూ దైవానికి మనస్సులోనే చేతులు జోడించి నమస్కరించాడు ప్రకాశ్. కాని ఎందుకనో ఆ తారీఖు మనస్సుకి గుర్తుకొస్తే చాలు గుండెల్లో ఏదో బాధగా. గుబులు గుబులుగా వుందతనికి.

అది ఆశ్వీజమాసం. శుక్లపక్షం. పుచ్చపువ్వులాటి శరత్కాలవెన్నెల కెరటాలనురుగుతో పోటీపడుతోంది.

సాయంకాలం వ్యాహాళికోసం వచ్చిన జనం చాలా మంది యిళ్ళకు తిరుగుముఖం పట్టారు. రేడియోలోంచి సుమధుర సంగీతం శ్రవణానందంగా సన్నగా వినవస్తోంది. ఆ ప్రశాంత నిశాసమయంలో అత్యంతానురాగపూరితులైన ప్రేమికుల జంట ఆ ప్రకృతి ప్రేమ సుధాధారాలను తన్మయత్వంతో ఆస్వాదిస్తోంది.

ప్రియురాలి వొడిలో తలవుంచి విశ్రాంతి తీసుకుంటున్న ప్రియుడు, ఆమె ముఖబింబానికీ, అంబర వీధిలో ప్రకాశిస్తున్న సుధాకరుని ప్రతిబింబానికీ గల తారతమ్యాన్ని తనలో తనే గుణించుకుంటున్నాడు. అతని జీవనజ్యోతి ఆమె. ఎండు మోడువారిన అతని జీవితంలో యిక సుఖసంతోషాలకూ, ఆనందోత్సాహాలకూ తావులేదని, నిరాశ చేసుకున్న అతని హృదయాన్ని తన ప్రేమామృతవర్షంతో చిగురింపజేసిన ఆమె సుధారాణి. అతను సూర్యప్రకాశ్.

వారి జీవితం గులాబీ బాటగా గుబాళిస్తోంది.

హైదరాబాదులో వుద్యోగం దొరికిన ప్రకాశ్, వారం రోజుల శెలవుమీద సుధారాణితో కలిసి మద్రాసు వచ్చాడు. శెలవులు కులాసాగా గడిపి యిద్దరూ తిరిగి వచ్చారు హైదరాబాదుకి.

ఒకనాటి వుదయం ఆరున్నరకు నిద్రలేచిన ప్రకాశ్. ప్రక్కమంచం మీద యింకానిద్రపోతున్న సుధను చూసి ఆశ్చర్యపోయాడు. ప్రతిరోజూ తను నిద్రలేచేసరికల్లా స్నానం చేసి, జడ వేసుకుని, చక్కని ముస్తాబుతో కల కల లాడుతూ ప్రత్యక్షమయ్యే సుధ యీ రోజు ఇంక నిద్రపోతోంది. కారణం తెలియలేదు. ఒంట్లో ఏమైనా బాగులేదేమోనన్న సందేహం తోచి నుదుటిమీద చెయ్యి వేసి చూశాడు. వెచ్చగా వున్నట్టనిపించింది. అతని స్పర్శకు కళ్ళుతెరిచి సుధ నెమ్మదిగా లేచింది.

"ఏమిటి సుధా? యివాళ యింకా పడుకున్నావేం? ఒంట్లోఎలావుందేమిటి?" అంటూ ఆదుర్దాగా ప్రశ్నించాడు ప్రకాశ్.

నిజానికి ఆ రోజు ఆమె లేవలేకపోతోంది. కాని ఒంట్లో బాగులేదనితెలిస్తే ప్రకాశ్ బాధపడ్తాడన్న భయంతో ఓపికచేసుకుని నెమ్మదిగా లేచేసింది.

"ఒంట్లో ఏంలేదండీ! ఏమిటో నిద్రపట్టేసింది. కాస్త బద్ధకంగావుందంతే!" అంటూ తన మామూలు గృహనిర్వహణలో లీనమైంది.

కాని ఎక్కువకాలం తన ఒంట్లోని నలతను కప్పి పుచ్చలేకపోయింది సుధ. మరునాటి వుదయం పేపరు చూస్తున్న ప్రకాశ్ చేతికి కాఫీకప్పు అందిస్తూ తూలి పడపోయింది. ఆ వేగానికి కప్పులో కాఫీ పేపరుమీదా అతని బట్టలమీదా వొలికిపోయింది. ఆ సంఘటనకు అతనేమైనా అంటాడేమోనని భయంతో తనను తానే సర్దుకో బోయింది. కాని ఆమె వల్లకాలేదు.

కాఫీ ఒలికిపోయినందుకు ప్రకాశ్‌కేమీ కోపంరాలేదు గాని, సుధకి ఆరోగ్యం సరిగ్గా లేదని మాత్రం గుర్తించి భయపడి పోయాడు. ఆమెను పొదవి పట్టుకుని నెమ్మదిగా మంచం మీద పడుకోబెట్టి ఏంచెయ్యాలో తోచక వెంటనే ప్రభుకి ఫోన్ చేశాడు ప్రకాశ్. కొద్దిసేపటికే కార్లో వచ్చాడు ప్రభు.

ఆ లోపలే కాస్త తేరుకున్న సుధను చూస్తూ, "ఏం సుధా! ఒంట్లో ఏదో నలతగావున్నట్టు కనిపిస్తున్నావు. ఏమిటి సంగతి చెప్పవూ?'' అనునయంగా అడిగాడు ప్రకాశ్.

ఆమె చిరునవ్వుతో తల ప్రక్కకి తిప్పుకుని ఏదో జవాబిచ్చేలోగానే ప్రభు గదిలోకి ప్రవేశించాడు.

ఏం జరిగిందో తెలుసుకున్న ప్రభు కొద్ది నిముషాలు ఏదో ఆలోచించి, ఒక నిశ్చయానికి వచ్చిన వాడిలాగా తల పంకించి, ''ప్రకాశ్, నేను వెళ్ళి డాక్టర్ సుమిత్రను పంపుతాను, ఏం భయపడకు, ప్రమాదమైన జబ్బేమీ లేదులే!" అంటూ నవ్వేడు ప్రకాశ్ ఏమీ అర్థంకాక చూస్తూండిపోయాడు.

"అందుకనే నాతోబాటే వుంటే, ఏ సహాయం కావల్సినా పనికొస్తానని ఎన్నివిధాల చెప్పినా యిద్దరూ వింటేగా! యీ మారుమూలకాపురం ఏం సుఖంగా వుందని'' అని మందలించాడు ప్రభు యిద్దర్నీ.

''యిప్పుడేం మునిగిపోయిందన్నయ్యా! యిక్కడ హాయిగానే వుందిగా!''

''సర్లే, మీ యిష్టం! నేను వెళ్తున్నాను. సుమిత్ర వచ్చాక రిజల్ట్సు ఫోన్‌ద్వారా తెలియజెయ్యండి. నేను డిస్పెన్సరీలో వుంటాను" అని వెళ్ళిపోయాడు ప్రభు.

సుమిత్ర వచ్చింది. జబ్బు లక్షణాలను గురించి అనేక ప్రశ్నలడిగింది సుధను. ఆమె చెప్పిన జవాబులువిని, ఆమె జబ్బు ఫలానా అని తెలుసుకుని యివతలకి వచ్చిన డాక్టరును చూసి ఆతృతగా, ''ఏం డాక్టర్? ఏమిటి జబ్బు?" అంటూ ప్రశ్నించాడు ప్రకాశ్.

''జబ్బేం లేదండీ! మీ ప్రేమఫలం వుదయించబోతోంది. అంతే!'' నవ్వింది సుమిత్ర.

అతని ముఖంలో ఆనందరేఖలు వెల్లివిరిశాయి. సుమిత్ర వెళ్ళిపోయాక గబగబా గదిలోకి వచ్చి, సుధను ప్రేమతో దగ్గిరికి తీసుకుని హృదయానికి హత్తుకుంటూ, ''సుధా! నా కడుపులో పాలుపోశావు. నిజంగా నీకు ఏదోజబ్బుప్రారంభమైందనే భయపడిపోయాను సుమా!" అతని కనుకొలకుల్లో రెండు భాష్పబిందువులు నిల్చాయి.

నెలలు నిండుతున్న క్రొత్తలావణ్యం యినుమడించింది. ఆమె నేలమీద అడుగుపెత్తే పాదం అరిగిపోతుందేమోనన్నంత గారాబంగా చూసుకుంటున్నాడు ప్రకాశ్. వంటా అదీ చెయ్యడానికి మనిషిని కుదిర్చాడు.

నెలలు నిండాయి. ఆ రోజు ప్రభు చాలా ముఖ్యమైన పనిమీద విజయవాడ వెళ్ళాల్సి వచ్చింది. సమయానికి తను వూళ్లో లేకపోతున్నానని బాధపడ్డాడు. అయినా రెండు రోజులలో పని పూర్తిచేసుకుని తిరిగి వచ్చే లోపల సుధకు పురుడు రాదన్న ధైర్యంతో ప్రకాశ్‌కి జాగ్రత్త! అనిచెప్పి అవసరమొస్తే సుమిత్ర సహాయం తీసుకోమని, అన్ని ఏర్పాట్లూచేసి వెళ్ళిపోయాడు.

అనుకున్నట్టుగానే ప్రభు వెళ్ళిననాటి సాయంకాలమే సుధకు నొప్పులు ప్రారంభమైనాయి.

ప్రకాశ్ ఆమెను సుమిత్ర నర్సింగ్ హోమ్‌లో చేర్పించి ప్రభుకి వైరిచ్చాడు.

వరాండాలో నిలబడివున్న ప్రకాశ్‌కి సుధ మూలుగులు ములుకుల్లా హృదయాన్ని తాకి బాధిస్తున్నాయి. వినలేక పోతున్నాడు. అక్కడినుంచి పోనీ కాసేపు ఎటైనా వెళ్దామా? అనుకుంటే అందుకూ మనస్సురాలేదు. ఆమె లోపల బాధతో మెలికలు తిరిగిపోతోంది. సుమిత్ర మరిద్దరు నర్సులూ ఆమె దగ్గిరే వున్నారు. అయినా తనూ అక్కడుంటే బావుండునన్పించింది అతనికి. కాని ఎలా?

ఆరోజంతా బాధపడ్డాక మరునాడు పురుడొచ్చింది సుధకు. గదిలోంచి "క్వార్, క్వార్"మన్న ఏడుపు అతని ఆవేదనను, ఆతృతను కొద్దిగా శాంతింపజేసింది.

యింతలో తలుపు తీసుకుని యివతలికి వచ్చి నర్సు, ''ఆడపిల్లండీ!" అన్నది. ఆ విషయం అతనికేం పట్టలేదు. "ఆమెకేం భయంలేదు కదండీ!'' అన్నాడు.

"యిప్పుడేం చెప్పడానికి వీల్లేదండీ!" అంటూ ఆమె వెళ్ళిపోయింది.

అతని హృదయంలో మళ్లీ ఆలోచనలు ముసురుకున్నాయి. సుమిత్ర బయటికివచ్చి, "మిస్టర్. మీరోసారి యిలారండి." అని ఆజ్ఞాపించింది.

లోపలికి వెళ్లెడు. సుధ నీరసంగా కళ్లుమూసుకుని పడుకుంది. ఆమె ప్రక్కనే కూర్చుని. నుదుటిమీద చెయ్యివేశాడు. హఠాత్తుగా సుగుణ గుర్తుకొచ్చిందతనికి ఐదు సంవత్సరాల క్రిందట యిదే సన్నివేశం. హృదయం ఏదో కీడునే శంకిస్తోంది.

సుధ కదలలేదు.

"కాన్పు చాలా కష్టమయిందండీ! వెంటనే స్పృహ తప్పింది. ఒక్కసారి మిమ్మల్ని స్మరించింది. అందుకనే మిమ్మల్ని పిలిచేను" అన్నది సుమిత్ర సిరంజిలోకి మందు ఎక్కిస్తూ.

యింజక్షనిచ్చిన రెండునిముషాలకు సుధ మెల్లిగా కళ్ళు విప్పి చూసింది.

డాక్టరు కళ్ళు సంతృప్తితో మెరిశాయి. కాని ఆసంతోషం ఎంతోసేపు నిలవలేదు

సుధ శరీరం చలవలు కమ్మింది. "పాప! జాగ్రత్త" అన్న రెండు మాటలు మాత్రం అస్పష్టంగా ఆమె పెదిమెల మధ్యనుండి వెలువడేయి. ఆమె కళ్లు మూసుకుంది నిముషాలలో ఆమెప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

ఆ రోజూ ఏప్రెలు 24. అన్న విషయం గుర్తుకొచ్చిన ప్రకాశ్ గుండెలు బ్రద్దలై పోయాయి, "యీ ఏప్రెలునెల నా జీవితంలో శనిలా దాపురించిది సుధా!" అంటూ చలనరహితమైన ఆమె శరీరం మీద విరుచుకు పడిపోతున్న అతన్ని, అప్పుడే వూరినించి వచ్చినడాక్టర్ ప్రభు ఒక్క అంగలో దగ్గిరజేరి రెండుచేతుల్తోను పట్టుకున్నారు. అతనికేకలు విన్న పాపాయి వుయ్యాల్లోంచి కెవ్వుమంది.

తన సేవాపరిచర్యలతో ప్రాణంపోసి రక్షించింది ప్రకాశ్‌ని. కాని చివరికి ఆమెనే దక్కించుకోలేకపోయాడా భగ్నజీవి. ★

ఆంధ్ర మహిళా సభ

మైలాపూర్ - మద్రాసు

మహిళా విద్యాలయము : హిందీ, కాశీవిశ్వవిద్యాలయపుఅడ్మిషన్, ఆంధ్రా మెట్రిక్, ఇ. ఎస్. ఎల్. సి., పరీక్షలకు శిక్షణ.

పారిశ్రామిక విద్యాలయము : కుట్టు, ఎంబ్రాయిడరీ, ఊలు అల్లికలు, నూలు వడకుట, చేనేత, అచ్చుకూర్పు, ముద్రణ, బైండింగ్ ఇత్యాది పరిశ్రమలలో గవర్నమెంటు పరీక్షలకు శిక్షణ. బీద విద్యార్థినులకు ఉచితము.

మహిళా మందిరము : విద్యార్థినులకు వసతి గృహము.

ఆంధ్ర మహిళ : స్త్రీలలో విద్యా వ్యాప్తికై స్త్రీలచే నడుపబడుచున్న సచిత్ర మాస పత్రిక

నర్సింగ్ హోమ్ : స్త్రీ శిశు సంరక్షణశాల, ప్రసూతిశాల, ఉచిత వైద్యశాల, కుటుంబ నియంత్రణశాఖ, దంత వైద్యశాల—అడయారులో నిర్మించబడినవి. భారత ప్రభుత్వ ఆరోగ్య శాఖవారి విధానాన్ని అనుసరించి, సంక్షిప్త నర్స్ ఎయిడ్—మంత్రసాని పనులలో శిక్షణ యివ్వబడుచున్నది. ఫామిలీ ప్లానింగు వర్కర్సుకు శిక్షణ కూడ యివ్వబడుచున్నది.

ఆర్థోపీడిక్ సెంటర్ : వికలాంగులగు బాలబాలికలకు సంరక్షణ, విద్య యిచ్చే సంక్షేమకేంద్రం.


ముద్రణాలయము : విద్యార్థినులకు అచ్చుకూర్పు, బైండింగ్, ప్రూఫురీడింగు, మొదలైనవి ఉచితంగా నేర్పబడును. ప్రింటింగు జాబ్ వర్క్సు చేయబడును.

నాగేశ్వర శిశువిహార్ : పిల్లల విద్యావినోద కేంద్రం ప్రాథమిక పాఠశాల నడుపబడుచున్నది.

వనితా బాలవిహార్ : స్త్రీలకు, పిల్లలకు, పార్కు, ఆటస్థలం

ఆంధ్ర మహిళా సభ, హైదరాబాదు

హైదరాబాదు శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలు: (1) రీజనల్ హేండిక్రాఫ్ట్సు, (2) సంక్షిప్త విద్యాప్రణాళిక, (3) చేనేత శిక్షణ- ఉత్పత్తికేంద్రము, (4) పౌర సంక్షేమ కార్యక్రమ పథకము, (5) వసతిగృహము.



Printed and Published by N. R. Chendur at Andhra Mahila Press, 7-A, Rosary Church Road, San Thome, Madras-4. Hony. Editor: Mrs. Malati Chendur